www.vaarthavedhikasurya.com

PRGI.NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 1 | సంచిక: 292 | గురువారం, 19 మార్చి, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 1 | ISSUE : 292 | THURSDAY, MARCH 19, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


పాఠకులకు,
ప్రకటనకర్తలకు
శ్రేయోభిలాషులకు
ఏజెంట్లకు
'ఉగాది' పర్వదిన
శుభాకాంక్షలు.
- ఎడిటర్






# మూసీ అంశంపై.. మాటల యుద్ధం

• శాసనసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీ వేడి చర్చ • మూసీ ప్రక్షాళన, వ్యయం, పునరావాసంపై బీఆర్ఎస్ ప్రశ్నలు • డీపీఆర్ సిద్ధం కాకుండానే ఇళ్లు ఎలా? కూలుస్తారని నిలదీత • 'నగరాభివృద్ధి కోసం మూసీ ప్రక్షాళన' అంటూ మంత్రులు శ్రీధర్‌బాబు, భట్టి వివరణ • వివరణకు అసంతృప్తితో బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 18:

మూసీ ప్రక్షాళన అంశం శాసనసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. బుధవారం మూసీ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీ వేడి చర్చ జరిగింది. మూసీ ప్రక్షాళన, వ్యయం, పేదల పునరావాసం, ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నలు సంధించారు. కనీసం డీపీఆర్ కూడా సిద్ధం కాకుండానే ఇళ్లు ఎలా కూలుస్తారని నిలదీశారు. తొలుత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చర్చలో పాల్గొని పలు ప్రశ్నలు సంధించారు. ''మూసీ ప్రాజెక్టు వ్యయం గతంలో రూ.లక్షన్నర కోట్లు అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ఇప్పుడు ఆరు, ఏడువేల కోట్లతో పూర్తవుతుందని చెబుతున్నారని, ఇందులో ఏది నిజం'' అని ప్రశ్నించారు. ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి 18 నెలల సమయం పడుతుందన్న సిఎం.. ఇప్పుడు 2నెలల్లో ఎలా వచ్చిందన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిస్తూ.. మూసీ ప్రక్షాళన కేవలం సౌందర్యం కోసం కాదని, హైదరాబాద్ భవిష్యత్తు కోసం అన్నారు. గత మిగతా 2లో..

# 2029 లోనూ మాదే ప్రభుత్వం

> 2029లో కూడా ఈ ప్రభుత్వమే వస్తుంది. ఈ నాయకత్వమే, ఈ మంత్రివర్గమే కొనసాగుతుంది. మాతోనే తెలంగాణ సుభిక్షమని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందని, పరిశ్రమలు వస్తాయని, వ్యవసాయం లాభసాటిగా మారుతుందని ప్రజలు నమ్ముతున్నారు.
> - సీఎం రేవంత్‌రెడ్డి

• గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధికి నిదర్శనం • 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి విశిష్ట ప్రణాళిక • బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయినా.. అహంకారం తగ్గలేదు • ప్రజలు ఓడించి పక్కన కూర్చోబెట్టినా నియంత పోకడే.. • కొత్త గవర్నర్‌కు ప్రతిపక్ష నేత శుభాకాంక్షలు చెబుతారనుకున్నా • వైఎస్ అండతో హరీశ్ మంత్రి అయితే.. బాబు వల్ల కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యారు.. • అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు • 20న మంత్రివర్గం భేటీ.. అదే రోజు బడ్జెట్

హైదరాబాద్ ప్రతినిధి, (వార్త వేదిక సూర్య)-మార్చి 18:



బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయినా.. అహంకారం మాత్రం తగ్గలేదని, ప్రజలు ఓడించి పక్కన కూర్చోబెట్టినా నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైజింగ్‌ను వెకిలి చేస్తున్నవారికి.. రావణాసురుడికి పట్టిన గతే పడుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిగతా 2లో..

## రాష్ట్ర ప్రజలకు సీఎం ఉగాది శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరికీ శుభం కలగాలని సీఎం ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని సీఎం అభిలషించారు. గత సంవత్సరం ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించామని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. ఈ ఏడాది రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు చాటి చెప్పేలా అందరు ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం అన్నారు.

# త్వరలో డిజిటల్ మీడియా పాలసీ

• జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో సానుకూల నిర్ణయం
• మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 18:



జర్నలిస్టుల సంక్షేమం కోసం త్వరలో డిజిటల్ మీడియా పాలసీ తేనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివ్‌సరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సమస్యలపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. అర్హులైన జర్నలిస్టులందరికిఅక్రెడిటేషన్ కార్డులు జారీచేస్తామని చెప్పారు. అక్రెడిటేషన్లపై మొదట విడుదల చేసిన జీవోలో జర్నలిస్టు సంఘాల వినతి మేరకు



## ఇరాన్ గ్యాస్ క్షేత్రాలపై క్షిపణుల వర్షం

2 లో..

## సికింద్రాబాద్‌లో 3వేల కిలోల
# కల్తీ పనీర్ పట్టివేత

• కల్తీ పనీర్, పాల ఉత్పత్తుల విక్రయ ముఠా గుట్టురట్టు
• ఖైరతాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో దాడులు

2 లో..




సంపుటి: 1 సంచిక: 292 వార్త వేదిక సూర్య గురువారం, 19 మార్చి, 2026

# 2029లోనూ మా ప్రభుత్వమే

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం సుదీర్ఘంగా ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి అని తెలిపారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడానికి అవసరమైన విశిష్ట ప్రణాళిక అని పేర్కొన్నారు. గొప్ప సంకల్పాన్ని ప్రజల ముందుంచిన గవర్నర్‌కు సీఎం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత అనుభవాలను, రాష్ట్ర పరిస్థితులను, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని.. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన పాలసీ డాక్యుమెంట్‌ను ప్రజల ముందు పెట్టామని రేవంత్ తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల ఆశీర్వాదంతో 2034 వరకూ ఇదే మంత్రి వర్గం అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, పరిశ్రమలు వస్తాయని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని రేవంత్ భరోసా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ సునామీ వస్తోందని.. కృత్రిమ మేధ వల్ల కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోతారని, తీవ్రమైన నిరుద్యోగ సమస్య తలెత్తే ప్రమాదం ఉందని ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని సీఎం గుర్తుచేశారు. ‘‘ఈ పరిస్థితిలో తెలంగాణ భవిష్యత్తు తరాల కోసం ప్రణాళికలు రచించాల్సిన అవసరం ఉందా? లేదా? మనం బలమైన శక్తిగా ఎదగాలనే ఆలోచననే.. గవర్నర్ ప్రసంగం ద్వారా తెలంగాణ పాలసీని ప్రవేశ పెట్టాం’’ అని పేర్కొన్నారు. రాష్ట్రానికి గొప్ప భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతోనే 2047 తెలంగాణ గ్లోబల్ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ తెచ్చామన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా 2023 డిసెంబరు 1 నుంచి కేసీఆర్ తీసుకున్న వేతనం ఒక కోటి ఆరు లక్షల యాభై ఆరు వేల ఆరు వందల డెబ్బై నాలుగు రూపాయలని రేవంత్ సభ సాక్షిగా తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సమయంలో ప్రధాన ప్రతిపక్ష నేత వస్తారనుకున్నామని, కొత్త గవర్నర్‌కు శుభాకాంక్షలు చెబుతారని భావించామని, అయినా ఆయన సభకు రాలేదని విమర్శించారు. విధులకు హాజరు కాకుండా జీతభత్యాలు పొందేవారిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ సభకు వచ్చి తెలంగాణ అభివృద్ధికి సలహాలు, సూచనలు చేయాలని కోరారు. రాజులు పోయినా, రాజ్యాలు పోయినా కొందరిలో రాచరిక పోకడలు పోలేదని వ్యంగ్యంగా అన్నారు. ప్రతిపక్ష సభ్యులకు సీఎం కుర్చీలో కూర్చోవాలనే యావ బాగా ఉందన్న రేవంత్.. కావాలంటే, సభ లేని సమయంలో వచ్చి కూర్చోవచ్చంటూ ఎద్దేవా చేశారు. లేదా, సభ జరిగే సమయంలోనైనా ఏదో ఒక పేపర్ తీసుకుని వచ్చి తన పక్కన కాసేపు కూర్చుని పోవచ్చునని, తాను చాలా లిబరల్‌గా ఉంటానని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్నిచూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. ఓఆర్ఆర్ లీజును రద్దు చేస్తామని, అవసరమైతే అవినీతికి పాల్పడిన వారిని లోపల కూడా వేస్తామని ప్రకటించారు. వార్డు సభ్యుడిగా కూడా గెలవని హరీశ్‌రావు.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సహకారంతోనే మంత్రి అయ్యారని, చంద్రబాబు కాళ్లు పట్టుకుంటే.. కేటీఆర్ సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యే అయ్యారని ఎద్దేవా చేశారు. హరీశ్, కేటీఆర్ ద్రోహులని, తాను ప్రజల ఆశీర్వాదంతో, స్వశక్తితో రాజకీయాల్లో ఎదిగానని.. తట్ట, మట్టి పని చేసి ప్రజల నుంచి వచ్చిన నాయకుడినని గుర్తు చేశారు. వారు తన కాలి గోటికి కూడా సరిపోరన్నారు. బీఆర్ఎస్ నేతలు ఎంత అడ్డం మాట్లాడితే అన్ని దెబ్బలు పడతాయన్నారు. ‘‘బరాబర్ అన్నందుకే.. నెత్తి మీద కాలు పెట్టి తొక్కి ఇక్కడికి వచ్చా.. అల్లాటప్పాగా రాలేదు. బరాబర్ 2029లో కూడా తొక్కకపోతే చూడండి.. బీఆర్ఎస్ నాయకులు అంతా కట్టకట్టుకుని రాండి.. తొక్కకపోతే చూడండి.. ఇదే



నా సవాలు.. రాసి పెట్టుకోండి.. ఎలా గెలుస్తారో నేను చూస్తా’’ అని ఘాటుగా హెచ్చరించారు. వయసుతోపాటు ఓపిక ఉండాలని.. ఓపికఉంటేనే అవకాశాలు వస్తాయని రేవంత్ అన్నారు. కుర్చీ వారసత్వంగా రాదని, ప్రజలు ఆశీర్వదిస్తే వస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఎవరు ఎన్ని ఆటంకాలు సృష్టించినా.. ఎవరు అడ్డుపడినా.. ముందుకు వెళ్లాలనే ప్రభుత్వం నిర్ణయించుకుందని సీఎం తేల్చిచెప్పారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ నగరం.. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు నగరాల్లా కాకూడదనే ఉద్దేశంతోనే క్యూర్ ప్రణాళికలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాజధాని నగరంలో ఆక్రమణకు గురైన చెరువులన్నింటినీ కాపాడుతున్నామని, ఇందుకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చెరువుల ఆక్రమణకు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్‌వోసీలు జారీ చేశారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ మాఫియా ఆక్రమణల్ని తొలగిస్తుంటే కూడా ప్రభుత్వంపై ఆగ్రహిస్తే తాము ఏం చేయాలని ప్రశ్నించారు. మూసీలో బఫర్ జోన్, రివర్ బెడ్‌లో 10 వేల ఆక్రమణలు ఉన్నాయని నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చెప్పిన విషయాలను ప్రస్తావించారు. మూసీ ప్రక్షాళన ద్వారా ప్రపంచ స్థాయి ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసుకుందామని చెబితే విపక్ష నేతలు వినట్లేదన్నారు. గతంలో ఉప్పల్ భగాయత్‌లో వారు చేసిన అభివృద్ధిపై నిజనిర్ధారణ కమిటీని వేయమంటే ఇప్పుడే వేస్తానన్నారు. ప్రజల భవిష్యత్తు కోసం తాము ప్రకటించిన విజన్.. కొద్ది మందికి పాయిజన్‌గా మారి బాధపెడుతోందని సీఎం వ్యాఖ్యానించారు. అధికార పార్టీని విమర్శించడం సహజమే అయినా.. బీఆర్ఎస్ నేతలు పరిధి దాటి విషం కక్కుతున్నారన్నారు. ఆ విషాన్ని శివుడి లెక్క కంఠంలో దాచుకునే శక్తి తనకు ఉందన్నారు. కుళ్లుతో కుంగి, నశించే వారిని ఎవరు కాపాడలేరని.. వారి రోగాలకు ఆరోగ్యశ్రీలో కూడా చికిత్స లేదని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యేకి మాటలు, మూటలు, మాయమాటలు.. ఈ మూడు విషయాలనే తారక మంత్రంగా ఆయన తండ్రి నేర్పారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంలో బీఆర్ఎస్ నేతలు పీహెచ్‌డీ చేశారన్నారు. వారి సలహాలు మాంసం తిని, మద్యం మత్తులో మంత్రాలు చదివినట్లు ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రజల కోసం.. ప్రణాళికలు తయారు చేసి.. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చి.. తొలి విడతలో 1 ట్రిలియన్, రెండో విడతలో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ద్వారా నెలకు రూ.5 కోట్లు ఖర్చుచేసి అబద్ధాలు ప్రచారం చేస్తోందని రేవంత్ ఆరోపించారు. అబద్ధాల లైవ్ పోతే రూ.10, దానికి లైక్ కొడితే 50, కామెంట్ చేస్తే రూ.100 పంచుతోందన్నారు. నగదుకు నజారానా పెట్టి.. నూతన భట్రాజుల్లా తయారయ్యారని వ్యాఖ్యానించారు. ‘మీ నాన్న మీకు గొప్ప ఫాంహౌస్, పత్రిక, టీవీ అన్నీ ఇచ్చాడు. కానీ, తెలంగాణ ప్రజలకు ఏమిచారు? చిప్ప, రూ.8 లక్షల కోట్ల అప్పు తప్ప!’ అని కేటీఆర్‌నుద్దేశించి రేవంత్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం సోనియమ్మ దయతో వచ్చిందని కేసీఆర్ అసెంబ్లీలోనే చెప్పారని, ఆయన మాటలకు కూడా వీళ్లు వ్యతిరేకమా? అని ప్రశ్నించారు. విజన్ 2047లో భాగంగా రేర్ (గ్రామీణ వ్యవసాయ ప్రాంతం)లో ఉన్న లక్ష చదరపు కిలోమీటర్లను వ్యవసాయపరంగా అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ అన్నారు. పంట మార్పిడి ఎలా? పంటల మార్పిడి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఇప్పుడు కేటీఆర్ వెనక కూర్చున్న ఎమ్మెల్యే (కౌశిక్‌రెడ్డి) తన దగ్గర ఉన్నప్పుడు బాగానే ఉన్నారని, ఇప్పుడిలా చంపండి.. నరకండి.. కుప్పలేయండి అనే భాష నేర్చుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ వాళ్లు డ్రగ్స్, పబ్స్‌కి యువతను అంకితం చేశారని, తాము క్రీడా విధానాలు తెచ్చామని తెలిపారు. ‘‘ఫుట్‌బాల్‌లో దిగ్గజమైన మెస్సీతీసుకొస్తే విమర్శలా? వాళ్ల డ్రగ్స్ లోకల్‌ప్లేయర్స్ నిన్న ఇక్కడ ఫాంహౌస్‌లో దొరికారు కదా?’’ ప్రశ్నించారు. హిల్ట్ విధానం, టీడీఆర్‌లపై ఏవేవో విమర్శలు చేస్తున్నారని, వాటిపై కేటీఆర్, హరీష్ రావు ఏ విచారణ అడిగినా వేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్స్(ఏటీసీ)లో చేరిన ప్రతి విద్యార్థికి నెలకు రూ.2వేలు ఉపకార వేతనం ఇస్తామని, 100 ఏటీసీలు ఏర్పాటు చేసేందుకు ప్రసిద్ధ టాటా గ్రూప్ ముందుకొచ్చిందని అన్నారు. ‘‘తెలంగాణ ఉద్యమం సందర్భంగా భావోద్వేగాలతో 1200 మంది ఆత్మార్పణలు చేశారు. ఇవి ఆ నలుగురి కోసమే, తమ కుటుంబం కోసమే అన్నట్లుగా బీఆర్ఎస్ పనిచేసింది. నాలుగుకోట్ల నా తెలంగాణ కుటుంబసభ్యుల కోసం మేం ప్రణాళికలు వేసి సభలో పెట్టాం. వారు నోటిఫికేషన్లు ఇచ్చి పారిపోతే మేం ఇప్పటివరకు 67,763 మందికి నియామక పత్రాలిచ్చాం. ఇంకో 13,197ఉద్యోగాల నియామక ప్రక్రియ కొనసాగుతోంది. ఇవి కూడా పూర్తయితే 80వేలమందికి ఉద్యోగాలు ఇచ్చినట్లవుతుంది’’ అని రేవంత్ అన్నారు. సిగ్గులేకుండా అప్పుల గురించి మాట్లాడుతున్నారని, 2014 వారికి అధికారం అప్పగించినప్పుడు రూ.67 వేల కోట్ల అప్పులు ఉంటే బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో చేసిన మొత్తం అప్పులు రూ.8.11 లక్షల కోట్లు అని అన్నారు. ఏకంగా 11.5శాతం వడ్డీకి రుణాలు తెచ్చారని, కమీషన్లకు కక్కుర్తిపడ్డారని ఆరోపించారు. నేను ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్‌ల దగ్గరకు తిరిగి తిరిగి 27వేల కోట్ల పైచిలుకు రుణాల రీకన్‌స్ట్రక్షన్ చేశామని, దీంతో ఏటా రూ.4వేల కోట్లు మిగులుతోందని చెప్పారు. మొత్తంగా 2లక్షల కోట్ల అప్పు రీ కన్‌స్ట్రక్షన్ చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. తాము మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం కల్పించామని, మాత్రం సొంతింటి ఆడబిడ్డ కన్నీరు పెట్టి వీధిలోకి వచ్చిందని రేవంత్ అన్నారు. ‘‘నీ సొంతింటి ఆడబిడ్డను లిక్కర్ రాణి అని నీ పక్కన కూర్చున్నోళ్లే అన్నారు. సోదరుడిగా చీమ కుట్టినట్లు ఉండదా? ఈ ఒక్క ఉదాహరణ చాలు మీ శైలి ఏంటో చెప్పడానికి’’ అని ఎద్దేవా చేశారు. సీఎం సహాయనిధిని బీఆర్ఎస్ వాళ్ల చుట్టాలు, కావాల్సిన వాళ్లకు ఇచ్చి చెక్కులు కూడా వాళ్ల ఖాతాల్లోనే వేసుకుని దొంగిలించిన దొంగలని ఆరోపించారు. ‘‘మీకు వచ్చే ఎన్నికల్లో వంద నియోజకవర్గాల్లో డిపాజిట్ వస్తే ముక్కు నేలకు రాస్తా. సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేట ఎక్కడా వివక్ష చూపకుండా ఇళ్లు మంజూరు చేశాం. రాష్ట్రంలో ఇప్పటివరకు 5100 కోట్లు ఎవరు పనిచేసుకుంటే వారి ఇళ్ల నిర్మాణం కోసం టకా టకా పడేటట్లు చేశాం. రూ.18 వేల కోట్ల రైతు భరోసా ఇచ్చాం. రేపు 22న మళ్లీ మొదలుపెడుతున్నాం. సన్నవడ్లకు బోనస్‌గా రూ.1940 కోట్లు ఇచ్చాం. ఇవి మా గ్యారంటీలు. అమలుచేశాం’’ అని సీఎం వివరించారు.

## నేటి నుంచి భద్రాచలంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

భద్రాచలం: ఉగాది పర్వదినం సందర్భంగా నేటి నుంచి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా ఉగాది రోజున ఉత్సవాలకు అంకురార్పణ జరపడం ఆనవాయితీగా కొనసాగుతున్నది. పరాభవ నామ సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలతో ఆలయ అర్చకులు, వేద పండితులు వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 27న మిథిలా మండపంలో సీతారామ కళ్యాణోత్సవం జరపనున్నారు. ఏప్రిల్ 2 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. కాగా, బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నవమి రోజున రెండు లక్షల తలంబ్రాల ప్యాకెట్లు, లక్ష లడ్డూలు సిద్ధం చేసినట్లు వివరించారు.

## యూరియా యాప్’ రద్దు చేయాలి: నెల్లికంటి సత్యం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 18: రాష్ట్రంలో రైతులు ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆవేదన వ్యక్తంచేశారు. ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిపడా ఎరువులు అంద క రైతులు దుకాణాల ఎదుట చెప్పులు వరుసలో పెట్టాల్సి వస్తున్నదని, యూరి యా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సక్రమంగా ఎరువులు అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు






## ఇరాన్ గ్యాస్ క్షేత్రాలపై క్షిపణుల వర్షం

- ఇరాన్ పార్స్ సహజవాయు క్షేత్రంపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్, అమెరికా!
- ఇరాన్ ప్రభుత్వ ఆధీనంలోని మీడియా వెల్లడి
- గల్ఫ్ దేశాల్లోని ఇంధన సదుపాయాలపై దాడులు చేస్తామని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు
- ఇజ్రాయెల్ దాడుల్లో నిఘా మంత్రి ఖతీబ్ మృతి

దక్షిణ బుషెహర్ ప్రావిన్సు/న్యూఢిల్లీ: దక్షిణ ఇరాన్ సముద్ర తీరంలో గల పార్స్ సహజ వాయు క్షేత్రానికి సంబంధించిన సదుపాయాలపై బుధవారం దాడి జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వ ఆధీనంలోని మీడియా వెల్లడించింది. ఇరాన్‌కు చెందిన దక్షిణ బుషెహర్ ప్రావిన్సులోని అసలుయేహ్ వద్ద ఉన్న సదుపాయాలపై దాడి జరిగిందని ఇరాన్ ప్రభుత్వ అధీనంలోని టెలివిజన్, ఇర్నా వార్తా సంస్థ తెలిపాయి. అయితే పూర్తి వివరాలను అవి వెల్లడించలేదు. పర్షియన్ గల్ఫ్‌లోని సముద్రతీర క్షేత్రాన్ని ఇరాన్ ఖతార్‌తో పంచుకుంటుంది. యుద్ధ సమయంలో ఇతర గల్ఫ్, అరబ్ దేశాలతోపాటు ఖతార్‌పై పదేపదే ఇరాన్ దాడి చేసింది. ఈ దాడి చేసింది ఇజ్రాయెలా లేదా అమెరికా అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. కాగా, అమెరికా ప్రధానంగా దక్షిణ ఇరాన్‌పైనే తన దాడిని కేంద్రీకృతం చేసింది. ఇరాన్‌కు చెందిన ప్రధాన చమురు నిల్వ కేంద్రమైన పర్షియన్ గల్ఫ్‌లోని ఖర్గ్ ద్వీపంపై అమెరికా ఇటీవల దాడి చేసింది. కాగా, పార్స్ సహజ వాయు క్షేత్రానికి సంబంధించిన సదుపాయాలపై జరిగిన దాడిపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈలోని చమురు, గ్యాస్ సదుపాయాలపై దాడి చేస్తామని హెచ్చరించింది. ఇజ్రాయెల్ సైన్యం ఉపయోగించే పరిభాషనే వాడుతూ సౌదీ అరేబియాలోని సమ్రెఫ్ రిఫైనరీ, దాని జుబెయిల్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై దాడి చేస్తామని ఇరాన్ నిర్దిష్టమైన హెచ్చరికలు జారీచేసింది. యూఏఈకి చెందిన అల్ హసన్ గ్యాస్ క్షేత్రాన్ని, పెట్రోకెమికల్ ప్లాంట్లు, ఖతార్‌లోని రిఫైనరీని ధ్వంసం చేస్తామని ఇరాన్ హెచ్చరికలు జారీచేసింది. తన దక్షిణ పార్స్ గ్యాస్ క్షేత్రం, దాని అనుబంధ సదుపాయాలపై బుధవారం తెల్లవారుజామున దాడి జరిగినట్లు ఇరాన్ తెలిపింది. రాన్‌కు చెందిన మరో ఉన్నతాధికారిని చంపివేసినట్లు ఇజ్రాయెల్ బుధవారం ప్రకటించగా ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు ఇద్దరిని బలిగొన్నాయి. ఇరాన్ నిఘా శాఖ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్ మంగళవారం రాత్రి జరిగిన సైనిక దాడిలో మరణించినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. ఖతీబ్ మరణాన్ని ఇరాన్ ధ్రువీకరించింది. ఇరాన్ ఉన్నత భద్రతాధికారి అలీ లారీజానీ, పారామిలిటరీ రివల్యూషనరీ గార్డు అధిపతి బీజ్ ఫోర్స్‌ను ఇజ్రాయెల్ హతమార్చింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ తన దాడులను బుధవారం కూడా ఉధృతంగా కొనసాగించింది. బీరుట్‌లోని అనేక అపార్ట్‌మెంట్లపై ఇజ్రాయెల్ దాడులు జరిపింది. ఈ దాడుల్లో డజను మంది వరకు మరణించారు. ఇరాన్‌లో బుషెహర్ అణు విద్యుత్తు కేంద్రం సముదాయంపై క్షిపణి దాడి జరిగింది. ఈ దాడిలో ప్రాణనష్టం కాని విద్యుత్తు కేంద్రానికి నష్టం కాని జరుగలేదని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) చీఫ్ రఫేల్ గ్రాసీ తెలిపారు. ఇజ్రాయెల్‌కు చెందిన మొస్సాద్ నిఘా సంస్థకు గూఢచారిగా పనిచేశాడన్న ఆరోపణలపై ఓ వ్యక్తికి ఇరాన్ మరణశిక్ష అమలుచేసింది. ఆ వ్యక్తిని కౌరోష్ కెయ్యానీగా గుర్తించిన మిజాన్ వార్తా సంస్థ ఇరాన్‌కు చెందిన కీలక ఫొటోలు, ప్రదేశాలకు సంబంధించిన సమాచారాన్ని ఇజ్రాయెల్‌కు అతను చేరవేసినట్లు తెలిపింది. కాగా, దక్షిణ ఫార్స్ ప్రావిన్సులోని అరెస్థాన్‌లో ఓ కోర్టు సముదాయంపై ఇజ్రాయెల్, అమెరికా వైమానిక దాడి జరిపినట్లు మిజాన్ తెలిపింది.



## మూసీపై.. మాటల యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ హయాంలో మూసీ పరివాహక ప్రాంతం మురికికూపంగా మారిందని, ఆక్రమణల వల్ల నగరం మునిగిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రాజెక్టులో పూర్తి పారదర్శకత పాటిస్తామని, ప్రతి పైసాకూ లెక్క ఉంటుందని, అవసరమైతే పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మెయిన్ హార్ట్ కంపెనీ డిసెంబరు 2024లో డీపీఆర్ వర్క్ మొదలుపెట్టిందని, ఈ ఏడాది ఫిబ్రవరిలో సమర్పించిందని వెల్లడించారు. అవసరమైతే ఆ నివేదికను సభలో ప్రవేశపెట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. 2016లో బఫర్ జోన్‌కు ఇరువైపులా 50 మీటర్లు ఉండాలని తెచ్చిన జీవో ప్రకారమే తాము నడుచుకుంటామని తెలిపారు. ఏడీబీ రుణం విషయంలో వచ్చే బోర్డు మీటింగ్‌లో స్పష్టత వస్తుందని, వాళ్లు సంతృప్తిగా లేకపోతే వేరే సంస్థ ద్వారా చేపడతామన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన ఎస్టీపీలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను తాము అధికారంలోకి వచ్చాకే పూర్తిచేశామని చెప్పారు. మధ్యలో కేటీఆర్ మళ్లీ కలుగజేసుకుని మంత్రి సమాధానాలు సంతృప్తికరంగా లేవన్నారు. దీనిపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుంటూ.. మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు బీఆర్ఎస్ సభ్యులు వచ్చి ఉండాల్సిందన్నారు. అయితే దానిని ప్రజల మధ్య నిర్వహిస్తే తాను వచ్చేవాడినని, స్టార్ హోటల్‌లో పెడితే ఎలా వస్తామని కేటీఆర్ అన్నారు. మూసీ ప్రక్షాళనను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు అనేక జబ్బులతో బాధపడుతున్నారని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. వద్దని బీఆర్ఎస్ భావిస్తుందా? అని నిలదీశారు. పరివాహక ప్రాంతంలో ఉన్నవారందరికీ అపార్ట్‌మెంట్లు కడతామని ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. ఎస్టీపీల్లో మురుగునీటిని శుద్ధిచేసి మూసీలో వదులుతామని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశామని తెలిపారు. ప్రతిపక్షం మంచి సలహాలు ఇవ్వొచ్చన్నారు. అయితే తాము అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమా ధానం దాటవేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వెళుతూ వెళుతూ.. ఖమ్మం లోని వెలుగుమట్లలో పేదల ఇళ్లను కూలగొట్టారని భట్టివిక్రమార్కపై విమర్శలు చేశారు. దీనిపై మంత్రి తుమ్మల స్పందిస్తూ.. వెలుగుమట్ల అంశంపై చర్చ కు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బీఆర్ఎస్ సిద్ధమా? అని సవాల్ చేశారు. ‘ఇందులో నిజాలన్నీ మీకు తెలిస్తే.. సభలో కూర్చోవడానికి కూడా మీరు సిగ్గుపడాల్సి వస్తుంది’ అని కేటీఆర్‌ను ఉద్దేశించి తుమ్మల వ్యాఖ్యానించారు. మంత్రుల వివరణతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి చివరకు సభనుంచి వాకౌట్ చేశారు.



## త్వరలో డిజిటల్ మీడియా పాలసీ

(మొదటి పేజీ తరువాయి)

మార్పులు చేశామని, అవసరమైతే మరోసారి మార్పులు చేసేందుకు సిద్ధమని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో రెండో విడత ఇళ్ల మంజూరు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మార్చి చివరి నాటికి సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. వివిధ దశల్లో ఆగిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు.

## సికింద్రాబాద్‌లో 3వేల కిలోల కల్తీ పనీర్ పట్టివేత

- కల్తీ పనీర్, పాల ఉత్పత్తుల విక్రయ ముఠా గుట్టురట్టు
- ఖైరతాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో దాడులు

సికింద్రాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 18:

సికింద్రాబాద్‌లో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా.. కల్తీ పనీర్, పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న ముఠా గుట్టును ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో చేపట్టిన ఆకస్మిక దాడుల్లో మొత్తం 3,892 కేజీల కల్తీ పాల ఉత్పత్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.11లక్షల వరకు ఉంటుందని చెప్పారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిబంధనలకు విరుద్ధంగా కల్తీ పాల ఉత్పత్తులను విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు.. జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ బి. సాహితితో కలిసి గంజ్ బజార్ ప్రాంతంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిందితులు నాణ్యత లేని, అపరిశుభ్రమైన పనీర్‌తో పాటు ఇతర పాల ఉత్పత్తులను సేకరిస్తున్నట్లు విచారణలో తేలింది. వాటిని ‘విజయ మిల్క్ షాప్’, ‘బాలాజీ డైరీ ప్రొడక్ట్’ వంటి పేర్లతో నాణ్యమైన ఉత్పత్తులుగా నమ్మిస్తూ హోటల్, క్యాటరింగ్ సర్వీసులకు కిలో రూ.280 చొప్పున విక్రయిస్తున్నారు. నిందితులు జైపాల్ సింగ్ రాజ్‌పురోహిత్, కొలారియా వైభవ్, నరేష్ కొలారియా, ప్రేమ్ అనిల్ వ్యాస్, రామ్ కిషోర్ కొలారియా, లక్ష్మీనారాయణ కొలారియాలను అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ తెలిపారు.

సంపుటి: 1 సంచిక: 292 వార్త వేదిక సూర్య || గురువారం, 19 మార్చి, 2026 ||





# విశాలభారతిలో ఘనంగా ఉగాది ఉత్సవాలు



చౌటుప్పల్, మార్చి 18 (వార్తా వేదిక సూర్య):

చౌటుప్పల్ లోని శ్రీ గాయత్రీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించే విశాల భారతి హైస్కూల్ లో బుధవారం ముందస్తు ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాల భారతి హైస్కూల్ కరస్పాండెంట్ వీసం చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... సృష్టి ఆరంభానికి సూచికగా ఉగాది పండగ జరుపుకుంటారని, ఉగాది పర్వదిన విశిష్టతను, వసంతకాలం తెలుగు నెలలలో మొదటి పండుగని, షడ్ రుచులు మానవ ఆరోగ్యానికి ఏ విధంగా ఉపయోగపడతాయో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశాల భారతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోడెల ఆంజనేయులు పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా సరస్వతీ విద్యాలయ 35వ వార్షికోత్సవం



- ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ రచయిత సింగర్ అభినయ శ్రీనివాస్

ఆత్మకూరు (ఎం), మార్చి 18 (వార్త వేదిక సూర్య):

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) సరస్వతి విద్యాలయంలో వార్షికోత్సవ సందర్భంగా చిన్నారులు వివిధ రకాల వేషధారణతో మంచి డ్యాన్సులు నాటికలు వేసి అలరించారు. అభినయ శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని కే క్రమశిక్షణ అలవాటు చేసుకుని సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగాలని రేపటి దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని అన్నారు అదేవిధంగా పాఠశాల కరస్పాండెంట్ తొర్ర విష్ణు, ప్రిన్సిపల్ పంజాబ్ నరసయ్య గౌడ్ మాట్లాడుతూ మా పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతోమంది ప్రస్తుతం డాక్టర్స్ గా పోలీసులుగా చాలామంది ప్రభుత్వ ఉపాధ్యాయులు గా ఇంకా మంచి మంచి ఉన్నత స్థానాలలో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ ఐలయ్య, ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్, మాజీ సర్పంచ్ జన్నాయకోడె నగేష్, మాజీ ఎంపీటీసీ యాస కవిత, యాస లక్ష్మా రెడ్డి, గుండెగాని ఐలయ్య గౌడ్, ఎస్ఎంసి అధ్యక్షులు మురళీకృష్ణ, మురారిశెట్టి మల్లేశం, ప్రభాకర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బూడిద శేఖర్ గౌడ్ పాఠశాల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## కౌకుంట్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీర్ల ఐలయ్య చిత్రపటానికి పాలాభిషేకం

యాదగిరిగుట్ట మార్చి 18 (వార్త వేదిక సూర్య):

యాదగిరిగుట్టలో నిషేధిత జాబితాలో ఉన్న ఇండ్లు, ప్లాట్లను నిషేధిత జాబితా నుండి తొలగించి తిరిగి క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటామంటూ ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కౌకుంట్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కౌకుంట్ల బాల్ రెడ్డి మాట్లాడుతూ పేదల పెన్నిధి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నిషేధిత జాబితాలో ఉన్న ఇండ్లు, ప్లాట్ల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. ఎప్పటిలాగానే తిరిగి ఇండ్లు,ప్లాట్లను క్రయవిక్రయాలు జరిగేలా చూడాలని అసెంబ్లీలో బీర్ల ఐలయ్య ప్రస్తావించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. పేదల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడే బీర్ల ఐలయ్య మరో 20 సంవత్సరాలు ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని అన్నారు. ఈ సందర్భంగా కౌకుంట్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు బీర్ల చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్, మాజీ ధర్మకర్త కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెలిమెల్లి శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బంధారపు బిక్షపతి, నాయకులు గుండు నరసింహ గౌడ్, బొజ్జ శ్రీనివాస్, పచ్చిమట్ల మనోజ్ గౌడ్, బొజ్జ సాంబేష్, కోలా కృష్ణ గౌడ్, సలాం, గంధ మల్ల వెంకటేష్, బీరు మల్లేష్, కరుణాకర్, కంసాని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.







# అత్యాధునిక వైద్య చికిత్స ద్వారా యువతి ప్రాణాలు కాపాడిన యశోదా బృందం

నల్లగొండ బ్యూరో, మార్చి 18 (వార్తా వేదిక సూర్య):

హైదరాబాద్‌లోని మలక్‌పేట్ యశోదా ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య చికిత్స ద్వారా పారా క్వాట్ అనే అత్యంత ప్రమాదకరమైన విషపదార్థాన్ని సేవించిన 28 ఏళ్ల యువతి ప్రాణాలను కాపాడినట్టు మలక్‌పేట్ పేట యశోద ఆసుపత్రి వైద్యులు తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రం లోని షాలిని రెసిడెన్సీ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల ఒక ఘటనలో 28 ఏళ్ల మహిళ సుమారు 10–15 మిల్లీలీటర్ల పారా క్వాట్ విషపదార్థాన్ని సేవించడం తో ఆమెను మొదట స్థానిక ఆసుపత్రికి తరలించగా అక్కడ గ్యాస్ట్రిక్ లావేజ్ చేసి ఒకసారి హీమోపర్ఫ్యూషన్ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం ఆమెను యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్‌కు తరలించారు. అక్కడ జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ,పుల్మనాలజీ నిపుణుల బృందం సమన్వయంతో ఆమెకు అత్యవసర చికిత్స ప్రారంభించారు. వైద్య పరీక్షల్లో ఆమెకు తీవ్రమైన కిడ్నీ దెబ్బతినడం తో పాటు జీర్ణాశయ శ్లేష్మక పొర దెబ్బతిన్నట్లు గుర్తించారు. గ్యాస్ట్రోఎంటరాలజీ నిపుణుల సూచన మేరకు చేసిన యూపర్ జీ ఐ ఎండోస్కోపీ పరీక్షలో ఈరోసివ్ గ్యాస్ట్రిటిస్, గ్రేడ్–డి ఈసోఫగైటిస్ ఉన్నట్లు తేలింది. ఈ విషపూరితం కారణంగా కడుపు, ఆహారనాళంలో తీవ్రమైన వాపు ఏర్పడింది. ల్యాబ్ పరీక్షల్లో వైట్ బ్లడ్ సెల్స్ పెరగడం, కిడ్నీ పనితీరు క్రమంగా తగ్గడం వైద్యులు గమనించారు. యూరిన్ డైథియోనైట్ పరీక్ష పాజిటివ్ రావడంతో పారా క్వాట్ విషపూరితం అని వైద్యులు నిర్ధారణ చేసారు. జనరల్ ఫిజీషియన్ డా. గుత్తా శశిధర్ రెడ్డి పర్యవేక్షణలో వైద్య బృందం చికిత్స ద్వారా శరీరంలో ఉన్న విషపదార్థాన్ని తొలగించేందుకు రెండు సార్లు హీమోపర్ఫ్యూషన్, కిడ్నీ పనితీరును మెరుగుపర్చేందుకు రెండు సార్లు డయాలసిస్, ఇన్‌ట్రావీనస్ యాంటీబయాటిక్స్, సహాయక మందులు ఈసోఫగైటిస్, గ్యాస్ట్రిటిస్‌కు ప్రత్యేక గ్యాస్ట్రోప్రొటెక్టివ్ చికిత్స,కిడ్నీ , కాలేయ పనితీరుపై నిరంతర పర్యవేక్షణ నిపుణుల సంప్రదింపులు చేసి సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డా. జి. సుధాకర్,కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ & హెపటాలజిస్ట్ డా. కిషన్ నున్సవాతా, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పుల్మనాలజిస్ట్ డా. ఉగంధర్ భట్టు సూచనలతో చెస్ట్ సీటీ స్కాన్‌లో ఎడమ ఊపిరితిత్తి దిగువ భాగంలో స్వల్ప ప్లూరల్ ఎఫ్యూషన్, అటెలెక్టాసిస్ కనిపించడంతో నెబ్యులైజేషన్, ఊపిరితిత్తుల సంరక్షణ చికిత్స అందించారు. చికిత్సకు రోగి క్రమంగా స్పందించిందని, కిడ్నీ పనితీరు మెరుగుపడుతూ రావడంతో పాటు హెపటైటిస్ లక్షణాలు కూడా తగ్గాయని. క్రమంగా ఆమె శారీరకంగా కోలుకొని స్వయంగా నడిచే స్థితికి వచ్చిందని, పరిస్థితి మెరుగుపడడంతో డిశ్చార్జ్ చేశామని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. అనంతరం యశోదా ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ.. ఈ కేసు ద్వారా అత్యంత ప్రమాదకరమైన పారాక్వాట్ విషప్రయోగాలను సమర్థంగా నిర్వహించడంలో మలక్‌పేట్‌లోని యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉన్న ఆధునిక క్రిటికల్ కేర్ సదుపాయాలు, మల్టీ-డిసిప్లినరీ వైద్య నైపుణ్యం మరోసారి వెల్లడయ్యాయి. విషప్రయోగం వంటి అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన నిర్ధారణ, హీమోపర్ఫ్యూషన్, డయాలసిస్ వంటి అధునాతన చికిత్సలు, అలాగే జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ,పల్మనాలజీ నిపుణుల సమన్వయంతో అందించిన వైద్య సేవలు రోగిని ప్రాణాపాయం నుంచి కాపాడడంలో కీలక పాత్ర పోషించాయి. యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్, హైదరాబాద్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ, యశోద హాస్పిటల్స్ అన్ని శాఖల్లో హీమోపర్ఫ్యూషన్, డయాలసిస్, అత్యాధునిక క్రిటికల్ కేర్ యూనిట్లు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, 24 గంటల అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండి పారాక్వాట్ వంటి అత్యంత విషపూరిత పదార్థాల వల్ల కలిగే సంక్లిష్ట కేసులను కూడా సమయానికి సమగ్ర వైద్య సేవలతో విజయవంతంగా నిర్వహించగలమని తెలిపారు. "పారా క్వాట్ విషపూరితం అత్యంత ప్రమాదకరమైనది. ఇది కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం, జీర్ణాశయ వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. సమయానికి హీమోపర్ఫ్యూషన్,సమగ్ర వైద్య చికిత్స అందించడం ద్వారా మాత్రమే రోగి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. ఈ కేసులో సమయానికి రిఫర్ చేయడం, హీమోపర్ఫ్యూషన్, డయాలసిస్,నిరంతర పర్యవేక్షణ వల్ల రోగి పరిస్థితి స్థిరపడిందని కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ "డా. గుత్తా శశిధర్ రెడ్డి అన్నారు. "పారా క్వాట్ విషపూరితం కిడ్నీలను తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. సమయానికి నెఫ్రాలజీ, డయాలసిస్ చికిత్స ద్వారా కిడ్నీ పనితీరును కాపాడవచ్చునని యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్ పేట్ సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, డా. జి. సుధాకర్ అన్నారు. "పారా క్వాట్ సేవించడం వల్ల జీర్ణాశయం, ఆహారనాళం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఎండోస్కోపీ ద్వారా త్వరగా నిర్ధారణ చేసి సరైన చికిత్స అందించడం చాలా అవసరమని యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్ పేట్ కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ & హెపటాలజిస్ట్, డా. కిషన్ నున్సవాతా పేర్కొన్నారు. "ఈ విషపూరితం ఊపిరితిత్తులపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. సమయానికి పుల్మనాలజీ చికిత్స అందించడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలను నియంత్రించగలిగామని" యశోదా సూపర్ స్పెషాలిటీ మలక్ పేట్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, డా. ఉగంధర్ భట్టు తెలిపారు. మరిన్ని వివరాలకోసం – ఎ. వాసుకిరణ్ రెడ్డి – 97057 71230 / 99499 98378 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

**బిఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

దేవరకొండ, మార్చి18 (వార్త వేదిక సూర్య):



దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాతలు తమ వ్యవసాయ పనులను ఉగాది నుండి కొత్తగా ప్రారంభిస్తారని, వ్యవసాయ నామ సంవత్సరంగా ఉగాది నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలలో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పర్వదినం అని ఆయన పేర్కొన్నారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. చెట్లు పచ్చగా చిగురిస్తూ, ప్రకృతి మాత నూతనోత్సాహాన్ని సంతరించుకుంటుందని, అదే నూతనోత్సాహం ప్రజల జీవితాల్లో నిండాలని కోరుకున్నారు. రైతన్నలు, సబ్బండ వర్గాల సంక్షేమం దిశగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టి, ప్రజల జీవితాల్లో మరింతగా గుణాత్మక మార్పును తీసుకురావాలని ఆశించారు. అప్పుడే పరాభవ నామ నూతన సంవత్సరానికి సంపూర్ణత లభిస్తుందని ఆయన అన్నారు. ఉగాది పచ్చడి మాదిరి, జీవితంలో షడ్రుచులను ఆస్వాదిస్తూ ప్రతీ సందర్భాన్ని వివేచనతో ఎదుర్కోవడం ద్వారానే మంచి చెడులు అర్థమై జీవితానికి పరిపూర్ణత చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో సాగునీరు తాగునీరు పుష్కలంగా లభించి, సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు

## పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న రమావత్ రవీంద్రకుమార్

దేవరకొండ మార్చ్ 18 (వార్త వేదిక సూర్య):

చింతపల్లి మండలం ఉమ్మతలపల్లి గ్రామానికి చెందిన ఏడుకొండల ధనలక్ష్మి– రవి గార్ల కూతురు తన్మయ్ శ్రీ మెదటి పుట్టిన రోజు వేడుకలు చింతపల్లి సాయి సుమంగళి ఫంక్షన్ హాల్ లో హాజరై నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ చిన్నారి తన్మయ్ శ్రీ నీ ఆశీర్వదించారు.ఆయన వెంట రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్, మాజీ రైతు బంధు అధ్యక్షులు ఉజ్జిని విద్యాసాగర్ రావు,సర్పంచ్ వంగాల శ్రావంతి రమేష్, ఉప సర్పంచ్ మంజుల అలువాల, ఇంద్రారెడ్డి,మదు సుదన్ రెడ్డి, రాజు నాయక్,యాదయ్య,మోతిరాం నాయక్, జైపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు



## 30న ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్ష

**విజయవంతం చేయాలని కరపత్రాల ఆవిష్కరణ**

మోత్కూరు, మార్చి 18 (వార్తా వేదిక సూర్య):

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఎస్సీలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెళ్ల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న ఇందిరా పార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరాహార దీక్ష ను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల ఎమ్మార్పీఎస్ నాయకులతో కరపత్రాలను కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాదిగ మాట్లాడుతూ గత బారాస ప్రభుత్వంలో దళితులకు 10 లక్షల రూపాయలు ఆర్థిక సహాయంఇచ్చి నిరుపేద కుటుంబాలకు ఆదుకుఉందని, ఇదే పథకానికి తాము అధికారంలోకి వస్తే 12 లక్షల ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. దళితుల ఆర్థిక అభివృద్ధి కోసం ఎదిగేందుకు సబ్ ప్లాన్ ఏర్పాటుతో పాటు అనేక పథకాలను ప్రవేశపెడతామని పేర్కొన్నదని, ప్రభుత్వం ఏర్పడే రెండున్నర ఏళ్ల కావోస్తున్న నేటికీ ఒక్క పథకం అతీగతి లేదన్నారు. ఈ పథకాల అమలుకై చేసే పోరుకు ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాంపాక రాములు, మండల ఇంచార్జి కూరెళ్ల సైదులు, మండల అధ్యక్షులు బందెల శ్రీను, యువసేన మండల అధ్యక్షులు పల్లె నవీన్, పట్టణ అధ్యక్షులు కూరెళ్ళ చిన్న సందీప్, నాయకులు రుద్రవెల్లి గణేష్, కళ్లెం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

చౌటుప్పల్, మార్చి 18 (వార్త వేదిక సూర్య):

శ్రీ సీత రామాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ బొబ్బిళ్ళ మురళీ, ధర్మకర్తలు కామశెట్టి చంద్రశేఖర్, వరకాల రవి, తమిశెట్టి నరసింహ, రోహిత్ దీపక్ శుక్ల, పెద్ది కృష్ణ, కిషోర్ శర్మ, ఆసీస్ కుమార్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చకిలం నరసింహారావు యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగామా నాగరాజరావు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

చౌటుప్పల్, మార్చి 18 (వార్తా వేదిక సూర్య):

చౌటుప్పల్ మున్సిపాలిటీ పట్టణంలో బస్టాండ్ వద్ద బుధవారం అమావాస్య సందర్భంగా చౌటుప్పల మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంచి కంటి భాస్కర్ గుప్తా విచ్చేసి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం మంచికంటి భాస్కర్ మాట్లాడుతూ అమావాస్య సందర్భంగా ఆర్య సంఘం ఆధ్వర్యంలో ఒక పూట ఉచితంగా అన్న ప్రసాద్ పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న పేదవారికి ఒక పూట ఉచితంగా భోజనం పంపిణీ చేయడం ఆర్యవైశ్యులని అభినందించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్ప మండల ఆర్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, తడకమళ్ళ శ్రీనివాస్ గుప్తా దాచేపల్లి విజయ్ నీలా సత్యనారాయణ దాచేపల్లి శ్రీనివాస్ శోభన్ బాబు, వీరమల్ల శ్రీమన్నారాయణ, సాయి రవి జ్యువెలర్స్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

మోత్కూరు, మార్చి 18 (వార్త వేదిక సూర్య):

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి హిందీ పరీక్షలను బుధవారం జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ నాగ వర్ధన్ రెడ్డి, తహశీల్దార్ పి.జ్యోతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓను ఆదేశించారు. విద్యార్థుల అనంతరం మౌళిక వసతులపై ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు.పరీక్షల పనితీరు నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎంఈఓ టి సత్యనారాయణ ఉన్నారు.

సంపుటి: 1 సంచిక: 292 వార్త వేదిక సూర్య గురువారం, 19 మార్చి, 2026




# మల్లు స్వరాజ్యం జీవితం ఆదర్శనీయం

- ప్రతియేటా ఉచిత మోకాలు చిప్ప ఆపరేషన్లు చేయడం అభినందనీయం: మీనయ్య
- ఆమె స్ఫూర్తిని కొనసాగించేందుకే సేవా కార్యక్రమాలు: డాక్టర్ మల్లు అరుణ్ రెడ్డి
- ఎంవిఎన్ ట్రస్ట్ సేవలను వినియోగించుకోవాలి

నల్లగొండ బ్యూరో, మార్చి 18 (వార్తా వేదిక సూర్య )

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత మల్లు స్వరాజ్యం జీవితం అందరికీ ఆదర్శనీయమని, ఆమె అందించిన పోరాట స్ఫూర్తిని, మానవత విలువలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎం వి ఎన్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ అక్కెనపల్లి మీనయ్య అభిప్రాయపడ్డారు. మల్లు స్వరాజ్యం 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆమె మనవడు, ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ మల్లు అరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో సత్యవతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో సూర్యాపేట జిల్లాకు చెందిన ఒక నిరుపేద కుటుంబానికి జుట్టుకొండ వీరయ్య కి ఉచిత మోకాలు చిప్ప మార్పిడి ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం జీవితమంతా త్యాగాలమాయం అంటూ జీవితాంతం నిరుపేదల కోసం అభ్యున్నతి కోసం పరితపించారని గుర్తు చేశారు. ఆమె చరిత్రను మర్చిపోకుండా భవిష్యత్ తరాలకు అందించేందుకు ఆమె పేరుతో నిర్వహించే సేవా కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. ప్రతీ యేటా వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఉచిత మోకాలు మార్పిడి ఆపరేషన్‌ను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. మల్లు స్వరాజ్యం మనవడు, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు మల్లు అరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం తన జీవితాన్ని అట్టడుగు వర్గాల కోసం ధరపోసిన గొప్ప వనిత అన్నారు. మహిళా హక్కులు, ప్రజల హక్కులు, పేదల భూముల కోసం చివరి వరకు జీవించారని గుర్తు చేశారు. స్వరాజ్యం మూడు సంవత్సరాల కిందట చనిపోయారని, ఆమె పేరుతో ప్రతీ యేటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.గొప్ప వ్యక్తుల స్ఫూర్తిని ముందుకు తీసుకుపోయందుకు ఇలాంటి కార్యక్రమం దోహద పడతాయని భావిస్తున్నట్లు చెప్పారు. అందుకే ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్ లోనూ మరింత ముందుకు తీసుకుపోతామని, ఇందుకు సంపూర్ణ సహకారం అందిస్తున్న సత్యవతి హాస్పిటల్ కు ప్రత్యేక ధన్యవాదము లు తెలిపారు. సత్యావతి హాస్పిటల్ ఎండి డాక్టర్ రాంమనోహర్ మాట్లాడుతూ..స్వరాజ్యం స్ఫూర్తిగా ఎన్నో కార్యక్రమాలు ప్రతీ సంవత్సరం చేయడం చాలా సంతోషకరమన్నారు. అందులో మా సత్యవతి హాస్పిటల్ భాగస్వామ్యం కావడం ఇంకా సంతోషంగా ఉన్నదని, మేము కూడా అనేక సేవా కార్యక్రమల్లో పాల్గొంటు న్నామని చెప్పారు. ఉచిత మెడికల్ క్యాంపు లు, నిరుపేదలకు ఉచిత సర్వీస్ కూడా అందిస్తున్నామని వివరిం చారు. ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి పీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతినెల మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని అలాగే మల్లు వెంకట్ నరసింహ రెడ్డి మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా పేద ప్రజలకు ఉచిత మోకాలు చిప్ప మార్పిడి నల్లగొండలోని సత్యవతి హాస్పిటల్ లో వారి మనవడు మల్లు అరుణ్ కుమార్ రెడ్డి చేస్తున్నారని చెప్పారు. డాక్టర్ అరుణ్ కి సత్యవతి హాస్పిటల్ యజమాన్యానికి ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం తరఫున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తు న్నాం. వైద్య సేవలు కాకుండా విద్యార్థులకు కరాటే ఉచిత కంప్యూటర్ శిక్షణ మహిళలకు టైలరింగ్ మరియు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. మా సంస్థ చేస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వర్ధంతి పురస్కరించుకొని సామాజిక సేవకు కృషి చేస్తున్న ఎంజియు తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిత, చర్లపల్లి రెసిడెన్షియల్ కాలేజీ ఎకనామిక్స్ లెక్చరర్ షేక్ సుల్తానా ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, డాక్టర్ సంపద, సత్యవతి వైద్యశాల ఎండి సత్యనారాయణ, కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఫ్యాకల్టీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులు పట్టుపురుగుల పెంపకంపై దృష్టి సారించాలి

- నల్గొండ జిల్లా పట్టు పురుగుల పెంపకానికి అన్ని రకాల అనుకూలం
- జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

నల్లగొండ బ్యూరో, మార్చి 18 (వార్తా వేదిక సూర్య):

పంట మార్పిడిలో భాగంగా రైతులు పట్టుపురుగుల పెంపకంపై దృష్టి సారిస్తే అధిక లాభాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.బుధవారం అయన నల్గొండ జిల్లా, కనగల్ మండలం, నరసింహపురం లో రైతు పుండరీకం సాగు చేస్తున్న పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని సందర్శించారు. పట్టుపురుగుల పెంపకానికి ఉపయోగ పడే భూములు,విస్తీర్ణం, పెట్టుబడి ఖర్చు, వాతావరణ అనుకూలత, కూలీలు తదితర వివరాలను రైతు పుండరీకం ద్వారా జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పట్టుపురుగుల పెంపకం రైతు పుండరీక మాట్లాడుతూ పట్టు పట్టుపురుగుల పెంపకానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నాయని, ఒక ఎకరాకు పెట్టుబడి 8నుండి 10లక్షలు ఖర్చు అవుతుందని, ప్రతి సంవత్సరం 8 పంటలు తీయవచ్చని, ఒక పంటకు లక్ష రూపాయల నుండి నాలుగు లక్షల వరకు ఆదాయం వచ్చిన సందర్భాలు ఉన్నాయని, తాను రెండు ఎకరాల్లో పట్టుపురుగుల పెంపకాన్ని చేపట్టడం జరిగిందని, 2017 సంవత్సరంలో పట్టుపురుగుల పెంపకం ప్రారంభించామని ఇప్పటివరకు నిరంతరాయంగా ద కొనసాగిస్తున్న ట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ పట్టుపురుగుల పెంపకాన్ని చేపట్టవచ్చని, ముఖ్యంగా వరి లాంటి మంటలకు వచ్చే తెగులు, ఎలాంటి చీడపీడల బెడద ఉండదని, కేంద్ర ప్రభుత్వం 50% ,రాష్ట్రప్రభుత్వం 25 శాతం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. రైతులకు మంచి లాభకారంగా ఇది ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పట్టుపురుగుల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలని, ఏప్రిల్ 2న గ్రామాలలో నిర్వహించే ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక గ్రామసభలలో పట్టుపురుగుల తోటల పెంపకానికి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పట్టు పురుగుల పెంపకానికి ప్రభుత్వం ఇచ్చే చేయూతను ఉపయోగించుకోవడం, అలాగే వ్యవసాయంలో నూతన సాంకేతికతను , మేలైన పద్ధతులను ఉపయోగించడం ప్రభుత్వ సబ్సిడీ వంటివాటిని పొందడం ద్వారా మంచి ఆదాయం వస్తుందని అన్నారు. రైతులు మూస పద్ధతిలో కాకుండా అన్ని రకాల పంటలు పండించాలని, ముఖ్యంగా జిల్లాలో ఆయిల్ ఫామ్ పట్టు పురుగుల పెంపకానికి ముందుకు రావాలని, వరి పండించడంలో తెలంగాణ దేశంలోనే ముందుందున్నప్పటికి ప్రత్యమ్నయ పంటల పట్ల కూడా రైతులు దృష్టి సారించాలని, ఆయిల్ పామ్, ఉద్యాన తోటల పెంపకం, పట్టు పురుగుల పెంపకం చేపట్టాలన్నారు. ప్రత్యేకించి సెరికల్చర్ లో సబ్సిడీ బాగా ఉందని, అంతే కాక ఈ పంటలో ఎలాంటి వృధా అన్నది లేనందున నష్టం కూడా రాదని,సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు లాభాలు వస్తాయని, పట్టుపురుగుల పెంపకానికి నల్గొండ జిల్లా భూమి, నీరు ,అన్నీ అనుకూలంగా ఉన్నాయని, అలాగే సెరికల్చర్ కు మంచి మార్కెట్ ఉందని, మంచి డిమాండ్ ఉందని దీన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ రైతు పుండరీకం కు కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన సెరికల్చర్ రిసోర్స్ సెంటర్ ను సందర్శించి రైతులతో మాట్లాడారు. అన్ని గ్రామాల సర్పంచ్ లు సేరికల్చర్ పంట పట్ల ప్రోత్సహించాలని ఈ సందర్భంగా తెలిపారు. కాగా ఇందిరమ్మ ఇండ్ల గురించి జిల్లా కలెక్టర్ సర్పంచులతో మాట్లాడుతూ గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు గురించి ఆరా తీశారు. సెక్రటరీ తో మాట్లాడి వ్యక్తిగత మరుగుదొడ్లకు బుక్ చేసుకోవడం ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులను పొందవ చ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ డిడి సుభాషిని మాట్లాడారు.హార్టికల్చర్ అధికారి అనంతరెడ్డి, నరసింహపురం సర్పంచు రాజేశ్వరి, ఇతర గ్రామాల సర్పంచులు, తదితరులు ఉన్నారు.



## అమావాస్య సందర్భంగా మార్కండేయ నగర్‌లో శ్రీ పోచమ్మ దేవాలయంలో ఘనంగా అన్న వితరణ కార్యక్రమం

మైలర్‌దేవ్‌పల్లి, మార్చి (వార్త వేదిక సూర్య):

అమావాస్య సందర్భంగా అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని మార్కండేయ నగర్‌లో ఉన్న శ్రీ పోచమ్మ దేవాల యంలో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వ హించారు . ఈ సందర్భంగా తెల్లవారుజామున నుంచే దేవాలయంలో భక్తుల రద్దీ నెలకొని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు.ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.పూజా కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం సమయంలో దేవాలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, అమ్మవారి దర్శనం అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల కోసం సముచితంగా ఏర్పాట్లు చేసి, శుభ్రతతో, క్రమబద్ధంగా అన్నదానం నిర్వహించడం విశేషంగా నిలిచింది. దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రతి అమావాస్య సందర్భంగా ఈ అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని తెలిపారు. భక్తులకు సేవ చేయడం, ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడం ఎంతో పుణ్యకార్యమని, ఈ సేవా కార్యక్రమాన్ని భవిష్యత్తులో మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత, మహిళలు, దేవాలయ కమిటీ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తం మీద అమావాస్య పర్వదినం సందర్భంగా నిర్వహించిన ఈ పూజలు, అన్న వితరణ కార్యక్రమం భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సేవా భావాన్ని చాటిచెప్పింది.

## రాజేంద్రనగర్‌లో ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యం

మైలర్‌దేవ్‌పల్లి, మార్చి (వార్త వేదిక సూర్య):

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివరాంపల్లిలో ఒక యువకుడు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీ (ఇంటి నంబర్: 6-9-72)లో నివసించే విష్ణు కాంత్ మార్కండేయ (32), తండ్రి హనుమాంజీ, ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. గత కొద్దిరోజులుగా ఆయన ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్థానిక రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైమ్ నంబర్ 280/2026 కింద మ్యాన్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అదృశ్యమైన విష్ణు కాంత్ మార్కండేయ గురించి ఎవరికైనా ఏవైనా ఆనవాళ్లు తెలిసినా లేదా సమాచారం లభించినా వెంటనే రాజేంద్రనగర్ పోలీసులను సంప్రదించాలని లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై ఒక ప్రకటనలో కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.



## గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

నల్లగొండ బ్యూరో, మార్చి 18 (వార్తా వేదిక సూర్య )




గ్రామపంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని గ్రామపంచాయతీ కార్మికులకు సపరేట్ గ్రాంట్ ఏర్పాటుచేసి వేతనాలు ఇవ్వాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రామపంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో నలగొండ మండల కేంద్రంలో భాస్కర టాకీస్ అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్ల బట్టలతో నిరసన తెలియజేశారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను సిఐటియు నాయకులను అక్రమంగా అరెస్టులు చేసి నిర్బంధించడాన్నీ నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతియుతంగా ధర్నా చేయడానికి వెళుతున్న నాయకులను,కార్మికులను అరెస్టు చేయడం నిర్బంధించడం సరైన పద్ధతి కాదని, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, అర్హత కలిగిన కారోబర్లను, బిల్ కలెక్టర్లను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని ప్రమాద బీమా, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కార్మికులకు వేతనాల కోసం ప్రత్యేక గ్రాంట్ ఏర్పాటు చేసి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య మాట్లాడుతూ.. పంచాయితీ ట్రాక్టర్ డ్రైవర్లకు గ్రామపంచాయతీ నిధులతోనే డ్రైవింగ్ లైసెన్స్ లు ఇప్పించాలన్నారు. నూతనంగా గెలుపొందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు వేతనాలు చెల్లించమని అడిగితే వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొద్దున్నే లేచి గ్రామాలను శుభ్రంగా ఉంచి గ్రామానికి అవార్డు రావడం లో ముఖ్యపాత్ర పోషిస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పై కక్ష సాధింపులు ఆపాలని, ఈ బడ్జెట్ సమావేశాలలోనే కార్మికులకు వేతనాల కొరకు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రావలసిన బట్టలు, సబ్బులు, నూనెలు గ్రామపంచాయతీ నిధులనుండి చెల్లించాలని, గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో కార్మికులు సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నల్గొండ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా సోషల్ మీడియా బాధ్యులు ఇరిగి ఎల్లేష్, మండల నాయకులు బోగరి సైదులు, కాశీమల్ల రవి, భీమనపల్లి మల్లయ్య, బక్కతోళ్ళ ప్రణయ్, కాసర్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## తన్మయశ్రీ జన్మదిన వేడుకలో పాల్గొన్న రవీంద్ర కుమార్ నాయక్, భిల్యా నాయక్



దేవరకొండ, మార్చి 18 (వార్తా వేదిక సూర్య):

చింతపల్లి మండల పరిధిలోని ఉమంతల పల్లి గ్రామానికి చెందిన ఏడుకొండల ధనలక్ష్మి,రవి కూతురు తన్మయ మెదటి పుట్టిన రోజు వేడుకలు చింతపల్లి సాయి సుమంగళి ఫంక్షన్ హాల్ లో జరుగగా అట్టి కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు నల్లగొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ నాయక్, కేతావత్ భిల్యా నాయక్, ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంగాల శ్రావంతి రమేష్,సాగర్ రావు, ఉప సర్పంచ్ మంజుల అలువాలు, ఇంద్రారెడ్డి,మదు సుదన్ రెడ్డి, రాజు నాయక్, యాదయ్య,మోతిరాం నాయక్, జైపాల్ నాయక్ పాల్గొన్నారు

## రాష్ట్ర ప్రజలందరికి ఉగాది శుభాకాంక్షలు

మాజీ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్

సికింద్రాబాద్, మార్చి 18(వార్త వేదిక సూర్య):

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరియు పరిసర ప్రాంతాల ప్రజలందరికి బౌద్ధనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ శ్రీ పరాభవనామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తీపి, చేదుల కలయికలాంటి ఈ ఉగాది పచ్చడి రుచిలాగే.. మీ జీవితంలో కూడా సుఖ, సంతోషాలు ఆయురారోగ్యాలు కలకాలం నిలిచి ఉండాలని కోరుకుంటున్నాను. అదేవిధంగా కొత్త ఆశలతో, కొత్త లక్ష్యాలతో, కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతు చెడును వదిలేసి, మంచిని స్వీకరిస్తూ.. ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే ఈ నూతన సంవత్సరంలో మీ కలలు సాకారం కావాలని ఆకాంక్షిస్తున్నాను.





## భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి

జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌కి వినతిపత్రం అందజేత

నల్లగొండ బ్యూరో, మార్చి 18 (వార్తా వేదిక సూర్య )

భారతదేశ అత్యున్నత ప్రమాణిక గ్రంథమైన రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, జై భీమ్ మహాసేన జాతీయ అధ్యక్షులు రాజ్యాంగం అంజన్న డిమాండ్ చేశారు. బుధవారం వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి హక్కులు, బాధ్యతలు, సమానత్వం వంటి విలువలను నేర్పే అత్యంత ముఖ్యమైన పత్రం అని తెలిపారు.భావి భారత పౌరులుగా ఎదుగుతున్న విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. కేరళ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చి, ప్రతి విద్యార్థికి రాజ్యాంగ పుస్తకాలను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకుని పాఠ్యాంశాల్లో రాజ్యాంగాన్ని చేర్చి, విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలను పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దళితవాది విశ్వజన కళామండలి జాతీయ అధ్యక్షులు మాస్టర్జీ, కెవిపియస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శీను, వంటపాక యాదగిరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

సంపుటి: 1 సంచిక: 292 వార్త వేదిక సూర్య గురువారం, 19 మార్చి, 2026





# కాంగ్రెస్ హామీలు గాలికి..

- రాజేంద్రనగర్‌లో బీజేపీ భారీ ధర్నా
- ఆరు గ్యారంటీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం: తోకల శ్రీనివాస్ రెడ్డి
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన
- భారీగా తరలివచ్చిన శ్రేణులు

మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 18 (వార్త వేదిక సూర్య):

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్-చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వ పిలుపు మేరకు బుధవారం రాజేంద్రనగర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. రైతులకు, యువతకు, మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందజేసే ఆసరా పింఛన్లను పెంచి తక్షణమే విడుదల చేయాలని, అలాగే పేదలకు ప్రకటించిన గృహ నిర్మాణ పథకాలను (ఇందిరమ్మ ఇళ్లు) వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తోకల శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. రైతులకు, యువతకు, మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందజేసే ఆసరా పింఛన్లను పెంచి తక్షణమే విడుదల చేయాలని, పేదలకు ప్రకటించిన గృహ నిర్మాణ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు.





## సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రక్షితను కలిసిన మాజీ కార్పొరేటర్ డా.హేమ సామల

సికింద్రాబాద్, మార్చి 18(వార్త వేదిక సూర్య)

సోమవారం రోజున డా.సామల ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ దినోత్సవ వేడుకకు హాజరు కానందువల్ల ఈ రోజు అంబర్ పేట్ డీసీపీ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ అఫ్ పోలీస్ రక్షిత కే.మూర్తి ను మర్యాదపూర్వకంగా కలిసి శాలవతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ విభాగం లో అందిస్తున్న సేవలను, సమాజంలో మహిళల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను ప్రత్యేకంగా కొనియాడారు. మహిళా సాధికారతకు ఆమె చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు మహిళల అభివృద్ధి, రక్షణ మరియు సమాన హక్కుల కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## అత్తాపూర్ సర్కిల్‌లో పారిశుద్ధ్యంపై జోనల్ కమిషనర్ ఆకస్మిక పర్యటన






### కఠిన ఆదేశాలు

మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 18 (వార్త వేదిక సూర్య):

రాజేంద్ర నగర్ జోన్ పరిధిలోని అత్తాపూర్ సర్కిల్‌లో పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించేందుకు జోనల్ కమిషనర్ మండా మకరందు, ఐఏఎస్ పర్యటించారు. ఈ పర్యటనలో అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య , డీఈఈ తిరుపతి , ఏఈఈ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) ఆశిష్ తివారి మరియు ఇతర పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పరిధిలోని ముఖ్య ప్రాంతాలను పరిశీలిస్తూ, అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య పనులను జోనల్ కమిషనర్ సమీక్షించారు. ప్రతిరోజూ ఎలాంటి విరామం లేకుండా క్రమం తప్పకుండా వీధి ఊడ్చివేత మరియు ఇతర పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా పీవీఎన్ఆర్ ఫ్లైఓవర్‌పై పరిశుభ్రతను కచ్చితంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు ప్రత్యేక సూచనలు ఇచ్చారు. ప్రధాన రహదారుల వెంట పేరుకుపోయిన నిర్మాణ మరియు కూల్చివేత వ్యర్థాలను తక్షణమే తొలగించాలని ఆయన ఆదేశించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు రవాణా సౌలభ్యం మెరుగుపడుతుందని తెలిపారు.పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని, ఫీల్డ్ స్థాయిలో తనిఖీలు పెంచాలని, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచుతూ, పబ్లిక్ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అత్తాపూర్ సర్కిల్‌ను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని జోనల్ కమిషనర్ పేర్కొంటూ, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# రాజేంద్రనగర్‌లో బీజేపీ నిరసన

### హామీలు అమలు చేయాలని డిమాండ్



మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 18 (వార్త వేదిక సూర్య):

భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ సర్కిల్ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పినా, గడిచిన రెండున్నర సంవత్సరాల్లో ఆ హామీలు పూర్తిగా అమలు కాలేదని విమర్శించారు. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడం, నిరుద్యోగ సమస్యలు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు సకాలంలో అందకపోవడం వంటి అంశాలను ప్రస్తావించారు.అలాగే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు ఇంకా అమలు కాలేదని ఆరోపించారు. ప్రభుత్వం మీద నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రజలు ప్రస్తుతం నిరాశకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీలను పూర్తిగా అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వై. శ్రీధర్, మల్లారెడ్డి, బాల్ రెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్ యాదవ్, కోరని సదానంద్, అడికే రాజు, షాబాద్ విజయ్, అడిగే మహేందర్, సులిగే విట్టల్, హరికిషన్, అడ్డుకే జనార్దన్, బాబురావు, కోరని క్రాంతి, శ్రీకాంత్ రెడ్డి, రవీందర్, డివిజన్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్, సులిగే వెంకటేష్, వినయ్ రెడ్డి, పాండుయాదవ్, రావుల భాస్కర్, సంతోష్ గౌడ్, సురేందర్, రాజశేఖర్ రెడ్డి, పవన్, రాజు పైల్వాన్, సరిత రెడ్డి, కవిత, రాకేష్ గౌడ్, పద్మావతి, యాదగిరి, రామారావు, విజయ్ యాదవ్, రాజు రెడ్డి, శివకుమార్, భాష పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలందరికి ఉగాది పండుగ శుభాకాంక్షలు

### ఎంపిపిఎస్ ఆర్కెపురం ఎస్జిటి : సయ్యద్ రూహి

సికింద్రాబాద్, మార్చి 18(వార్త వేదిక సూర్య)

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరియు పరిసర ప్రాంతాల ప్రజలందరికి తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటిఎఫ్) రాష్ట్ర మహిళ సంయుక్త కార్యదర్శి, ఎంపిపిఎస్ ఆర్కెపురం పాఠశాల ఎస్జిటి సయ్యద్ రూహి శ్రీ పరాభవనామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....తీపి, చేదుల కలయికలాంటి ఈ ఉగాది పచ్చడి రుచిలాగే.. మీ జీవితంలో కూడా సుఖ, సంతోషాలు ఆయురారోగ్యాలు కలకాలం నిలిచి ఉండాలని కోరుకుంటున్నాను. అదేవిధంగా కొత్త ఆశలతో, కొత్త లక్ష్యాలతో, కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతు చెడును వదిలేసి, మంచిని స్వీకరిస్తూ.. ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే ఈ నూతన సంవత్సరంలో మీ కలలు సాకారం కావాలని ఆకాంక్షిస్తున్నాను.



## అమావాస్య సందర్భంగా వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అన్నప్రసాద సేవ

మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 18 (వార్త వేదిక సూర్య):

మణికొండలో వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతీ అమావాస్య రోజున నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమం బుధవారం (మార్చి 18)న కూడా ఘనంగా జరిగింది. అమావాస్య సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ అన్నప్రసాద సేవ మధ్యాహ్నం 12 గంటల నుండి అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. గత రెండున్నర సంవత్సరాలుగా నిరంతరంగా ఈ అన్నప్రసాద సేవను నిర్వహిస్తూ సమాజానికి సేవలందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మణికొండ ప్రాంతానికి చెందిన పలువురు వాసులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.





## మల్లేష్ యాదవ్, షాబాద్ విజయ్‌లకు శుభాకాంక్షల వెల్లువ

మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 18 (వార్త వేదిక సూర్య):

భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన మల్లేష్ యాదవ్ మరియు జిల్లా కార్యాలయ కార్యదర్శిగా ఎంపికైన షాబాద్ విజయ్‌లకు రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు ఆడికే మహేందర్, ఆడికే రాజు ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మల్లేష్ యాదవ్, షాబాద్ విజయ్‌లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వినయ్ రెడ్డి, హరికృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.



## ఉగాది పండుగ అందరి జీవితాలలో కొత్త వెలుగులు నింపాలి

### ఆకాంక్షించిన ఏర్వ కుమారస్వామి

మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 18 (వార్త వేదిక సూర్య):

ప్రజాసేవే పరమావధిగా రాజేంద్రనగర్ నియోజక వర్గంలో నవ యువ యూత్ క్లబ్ మానవ సేవే మాధవ సేవా సంస్థ సేవలు అందిస్తోంది. ఈ ఉగాది పర్వదినం సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు నవ యువ యూత్ క్లబ్, మానవ సేవే మాధవ సేవా అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి ఉగాది పరాభవ సంవత్సర శుభాకాంక్షలను తెలియచేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు నూతన సంవత్సరం మనందరి జీవితాలలో కొత్త ఆశలు, ఆకాంక్షలు, నూతన ఉత్సాహాన్ని నింపాలన్నారు . ఈ సంవత్సరం ప్రతి ఒక్కరికి ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం ప్రసాదించాలని కోరారు. ఈ ఉగాది పండుగ అందరి జీవితాలలో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.



## ఆదర్శ కాలనీలో సీతారామ కల్యాణానికి గాయత్రి పొదుపు సంఘం నుంచి రూ.21 వేల విరాళం

మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 18 (వార్త వేదిక సూర్య):

మైలర్ దేవ్ పల్లి డివిజన్ ఆదర్శ కాలనీలో ఈ నెల 27న నిర్వహించనున్న సీతా రామ కల్యాణ మహోత్సవానికి శ్రీ గాయత్రి పొదుపు సంఘం ఆధ్వర్యంలో విరాళం అందజేశారు. సంఘం అధ్యక్షులు ఏదిరే శ్రీనివాస్ నాయకత్వంలో దేవాలయ కమిటీ ప్రతినిధులకు రూ.21,000 చందాగా అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఏర్వ కుమారస్వామి, సహాయ కార్యదర్శి దశపతి రాజు, సలహాదారులు కూడికల గణమ్మ, సభ్యులు ముదిగొండ సత్యనారాయణ, అదేట్ల నరేష్, సగ్గం మహేష్, గుమస్తా గంజి మార్కండేయ, ఏసాల శివ,. అలాగే దేవాలయ ప్రతినిధులు సంగ్గి శెట్టి లక్ష్మన్, దస బాలరాజ్ లు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు ఈ-వేస్ట్ సేకరణే మార్గం: డీసీ సమ్మయ్య

మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 18 (వార్త వేదిక సూర్య):

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అత్తాపూర్ పరిధిలో బుధవారం ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాల) సేకరణ మరియు రీసైక్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్తాపూర్ డీసీ సమ్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది చురుగ్గా హాజరైయ్యారు. ఈ సందర్భంగా డీసీ సమ్మయ్య మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో పెరిగిపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెద్ద ముప్పుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుపయోగంగా ఉన్న పాత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ భాగాలు, వైర్లు, బ్యాటరీలను ఇష్టారాజ్యంగా పారవేయడం వల్ల నేల, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని, అందుకే వాటిని శాస్త్రీయంగా రీసైక్లింగ్ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రిసోర్స్ పర్సన్ మరియు జవాన్ శేఖర్ తో పాటు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొని ఇంటింటికీ తిరిగి ఈ-వేస్ట్‌ను సేకరించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఎలక్ట్రానిక్ వస్తువులను పర్యావరణ హితంగా ఎలా డిస్పోజ్ చేయాలో వివరించారు. ఈ కార్యక్రమం లో సానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్, సి ఓలు, ఆర్పీలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సంపుటి: 1 సంచిక: 292 వార్త వేదిక సూర్య గురువారం, 19 మార్చి, 2026





# ముస్లిం సోదరుల సమస్యపై వెంటనే స్పందించిన నిరుడు శేఖర్ ముదిరాజ్

### దర్గా కలీజ్ ఖాన్ అండర్‌పాస్ రహదారికి తాత్కాలిక మరమ్మత్తులు

మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 18 (వార్త వేదిక సూర్య): కిస్మత్‌పూర్ 122 డివిజన్ పరిధిలోని దర్గా కలీజ్ ఖాన్ – హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్ అండర్‌పాస్ వద్ద రహదారి గుంతలమయంగా మారి తీవ్రంగా దెబ్బతింది. ఈ మార్గం ద్వారా ముస్లిం సోదరులు స్మశానవాటికకు వెళ్లాల్సి ఉండటంతో, వర్షపు నీరు, బురద, గుంతల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు తెలియజేశారు.ఈ సమస్యను గుర్తించిన కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్ గారు వెంటనే స్పందించి స్వంత ఖర్చులతో రహదారిపై కంకర పోసి తాత్కాలిక మరమ్మత్తులు చేయించారు. దీంతో స్మశానవాటికకు వెళ్లే ప్రజలకు తక్షణ ఉపశమనం లభించింది.ఈ సందర్భంగా స్థానిక ముస్లిం సోదరులు మాట్లాడుతూ, తమ సమస్యను వెంటనే పరిష్కరించిన శేఖర్ ముదిరాజ్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే నాయకుడని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం నాయకులు మహ్మద్ షనవాజ్, మాజీ వార్డు మెంబర్ శాదత్ బేగ్, నాయకులు సాయి యాదవ్, ప్రేమ్ కుమార్, ఈగ లక్ష్మణ్, అరుణ్ గంగని తదితరులు పాల్గొన్నారు.





## మణికొండ శివపురి కాలనీలో ట్రాఫిక్ సమస్యపై ఆర్.టి.ఏ కార్యాలయం తరలింపుకు నిరసన



మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 18 (వార్త వేదిక సూర్య): మణికొండ పరిధిలోని శివపురి కాలనీ ప్రధాన రహదారి కూడలిలో ఏర్పాటు చేసిన ఆర్.టి.ఏ కార్యాలయం కారణంగా తీవ్ర ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పాఠశాల విద్యార్థులు రోజువారీగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో బుధవారం శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా "ఆర్.టి.ఏ ఆఫీసు తరలించాలి", "మా కాలనీ మాకు ముద్దు – ఆఫీసు ఇక్కడ వద్దు", "వీ వాంట్ జస్టిస్" వంటి నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానిక అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ వెల్లడించారు.అనంతరం ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ సదానంద్‌ను కలిసి సమస్యను వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించి రేపటి నుండి అదనపు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక ప్రజలతో పాటు కుంబగళ్ళ ధనరాజ్, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, జైరామ్, కిరణ్, భాను చందర్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకురాళ్లు విజయలక్ష్మి, షకీలా రెడ్డి, శ్యామలెట్ రేఖ, మంజుల, దేవిప్రియ కూడా పాల్గొన్నారు.



## రాజేంద్రనగర్ డిపో వద్ద సిఐటియు ఆధ్వర్యంలో విద్యుత్ బస్సుల విధానంపై కార్మికుల నిరసన

మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 18 (వార్త వేదిక సూర్య): స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సులను ఆర్టీసీలకు ఇవ్వాలనే డిమాండ్‌తో రాజేంద్రనగర్ బస్సు డిపో ముందు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిమాండ్లతో కూడిన బ్యానర్‌పై కార్మికుల సంతకాలను సేకరించారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. కృష్ణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి ప్రైవేట్ కార్పొరేటర్లకు కాకుండా ఆర్టీసీలు స్వయంగా బస్సులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ విద్యుత్ బస్సులు ప్రవేశిస్తే కార్మికులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ రీజియన్‌లో ఇప్పటికే నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సుల కారణంగా మెకానికులు మిగులుగా మారారని, వారికి డ్రైవర్లు, కండక్టర్లుగా అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని అన్నారు. కార్మికులకు రావాల్సిన 2021–2025 వేతన సవరణను వెంటనే అమలు చేయాలని, 2017 వేతన సవరణకు సంబంధించిన అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా, ఆర్టీసీలో యూనియన్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి కార్యకలాపాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్మికులు అధిక పని భారంతో ఇబ్బందులు పడుతున్నందున శాస్త్రీయ సర్వే చేసి సరైన రన్నింగ్ టైమ్ ఇవ్వాలని, వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎం. సూర్య, బి. అగ్రయ్య, ఎన్. పాపయ్య, బి. వెంకటయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్యానర్‌పై సంతకాలు చేసి తమ మద్దతును తెలిపారు.



# మొక్కజొన్నను కొనుగోలు చేయాలి



### అసెంబ్లీ ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 18: మొక్కజొన్న పంటకు మద్దతు ధర కల్పించాలని, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అసెంబ్లీ ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళనకు దిగారు. దీనికంటే ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్ నేతృత్వంలో గన్‌పార్క్ వద్ద ఎమ్మెల్యేలు అమరవీరులకు నివాళులు అర్పించారు. అక్కడి నుంచి మొక్కజొన్న కంకులు చేతపట్టి, నినాదాలు చేస్తూ ప్రదర్శనగా అసెంబ్లీ ఆవరణలోకి వచ్చారు. దీంతో మొక్కజొన్న కంకులతో అసెంబ్లీలోకి ప్రవేశించడానికి వీల్లేదంటూ మార్షల్స్, పోలీసులు అడ్డు చెప్పారు. నేతల చేతుల్లో ఉన్న మొక్కజొన్న కంకులను లాక్కున్నారు. ఈ సందర్భంగా తోపులాట జరిగి గందరగోళం ఏర్పడింది. హరీశ్ చేతికి గాయమైంది. బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ ద్వారం వద్దే బైఠాయించి నిరసన తెలిపారు. ఆ తర్వాత అసెంబ్లీలోకి వెళ్లిపోయారు. గన్‌పార్కు వద్ద హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 8 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారని, పంట చేతికొచ్చి 15 రోజులవుతున్నా.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఇంకా ప్రారంభించలేదన్నారు. క్వింటాలుకు రూ.2,400 మద్దతు ధర ఉంటే.. మార్కెట్‌లో దళారులు రూ.1600–1700కు కొనుగోలు చేస్తున్నారని, చేసేది లేక రైతులు అమ్ముకుంటూ నష్టపోతున్నారన్నారు. ఇలా నష్టపోయిన రైతులకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలన్నారు.

#### 2400 మద్దతు ధర ఇవ్వాలి: కడియం

మక్కలకు రూ.2400లను కనీస మద్దతు ధరగా కేంద్రం ఖరారు చేసిందని, ఈ మేరకు పంటను కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గతఏడాది కన్నా ఈసారి రాష్ట్రంలో 4 లక్షల ఎకరాల్లో అదనంగా మక్కలు పండించారని, 11.72 లక్షల ఎకరాల్లో పంట సాగయిందని తెలిపారు. సభలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3.5 లక్షల ఎకరాల్లో పంటను సాగు చేశారని, ప్రభుత్వం వెంటనే మక్కల కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు కోరినంత ఎరువులు ఇవ్వాలని, ఎర్ర జొన్న పంటలను రూ.500ల బోనస్‌తో కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# యూరియా కష్టాలు తీర్చాం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, వార్త వేదిక సూర్య)-మార్చి 18: ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు గత యాసంగి కంటే 30 వేల మెట్రిక్ టన్నుల యూరియాను అధికంగా కొనుగోలు చేశారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. గత యాసంగిలో 10.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు కొనుగోలు చేస్తే... ఈ యాసంగిలో మార్చి 18 నాటికి 10.73 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు వివరించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి 10.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి తీసుకొచ్చి రైతులకు ఇచ్చినట్లు వెల్లడించారు. రైతులు క్యూ లైన్లలో నిలబడే పరిస్థితి రాకూడదనే యూరియా యాప్ తెచ్చామని అన్నారు. దేశంలో ఈ తరహా విధానం అవలంభిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తెలిపారు.



# ఈవీ కారు చార్జింగ్ పాయింట్ పేలుడు

- చార్జింగ్ పెట్టిన భవనానికి వ్యాపించిన మంటలు
- ఇండోర్‌లో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి
- ఢిల్లీలో షార్ట్‌సర్క్యూట్‌తో భవనంలో అగ్నిప్రమాదం
- అగ్నికి ఆహుతైన 9 మంది కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ/ఇండోర్: ఢిల్లీలో, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో బుధవారం వేర్వేరు అగ్నిప్రమాదాలు చోటుచేసుకొని రెండు కుటుంబాలకు చెందిన 17 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇండోర్‌లోని బ్రజేశ్వరి అనెక్స్ కాలనీలో ఓ మూడంతస్తుల భవనం బయట ఎలక్ట్రిక్ (ఈవీ) కారుకు చార్జింగ్ పెట్టగా.. బుధవారం తెల్లవారు జామున 3.30 గంటలకు చార్జింగ్ పాయింట్ వద్ద పేలుడు సంభవించింది. దీంతో క్షణాల్లో భవనం మొత్తానికి మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో భవనంలోని వారంతా గాఢ నిద్రలో ఉండగా.. ఇంట్లోని గ్యాస్ సిలిండర్లకు మంటలు అంటుకుని మరింతగా వ్యాపించాయి. సమాచారాన్ని అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినా.. అగ్ని ప్రమాదం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇంటి తలుపులకు అమర్చిన ఎలక్ట్రానిక్ తాళాలను తెరవడం క్లిష్టంగా మారింది. తలుపులు పగలగొట్టేటప్పటికే ఇంట్లోని ఇద్దరు మైనర్ బాలలు, ముగ్గురు మహిళలు సహా ఎనిమిది మంది కుటుంబసభ్యులు అగ్నికి ఆహుతయ్యారు. మరో ఇద్దరిని పోలీసులు రక్షించగా.. గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఢిల్లీలోని పాళం ప్రాంతంలో ఓ భవనంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి ఒకే కుటుంబానికి చెందిన 9మంది మరణించారు. రాజేందర్ అనే వ్యాపారికి చెందిన భవనంలో బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్, ఒకటో ఫ్లోర్‌లో బట్టలు, కాస్మెటిక్ షోరూమ్‌లు నిర్వహిస్తుండగా.. రెండో, మూడో ఫ్లోర్‌లో ఆయన ఐదుగురు కుమారులు, నలుగురు కోడళ్లు, కుమార్తె, ఏడుగురు మనవలు, మనవరాళ్లతో నివాసముంటున్నారు. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లోని షోరూంలో కాస్మెటిక్స్ ఉన్న కారణంగా మంటలు మరింతగా పెరిగి భవనంలోని అన్ని అంతస్తులకూ వ్యాపించాయి. దీంతో ఆ సమయంలో భవనంలో ఉన్న రాజేందర్ భార్య లాదో (70) సహా ఆమె ఇద్దరు కుమారులు, ఇద్దరు కోడళ్లు, కుమార్తె ముగ్గురు మనవరాళ్లు మంటల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయారు. మరో కుమారుడు తన రెండేళ్ల కూతురిని రెండో ఫ్లోర్ నుంచి కిందికి విసిరేసి తాను కూడా దూకేశాడు. దీంతో వీరిద్దరు గాయాలపాలై చికిత్స పొందుతున్నారు. మరో కుమారుడు మరోవైపు దూకి గాయాలతో చికిత్స పొందుతున్నాడు.

## పొత్తు ఉండదు: విజయ్

చెన్నై: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఏ కూటమిలో చేరకుండా, ఎవరితోనూ పొత్తు లేకుండా అధికారంలోకి వస్తామని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపంలో జరిగిన ఇఫ్తార్ విందుకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ, తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి రకరకాల వదంతులు రేగుతున్నాయని పేర్కొన్నారు. ఏదో ఒక పార్టీకి బీ–టీం అంటూ చెబుతున్నారని, నిజానికి తాను ఎవరి టీం కాదని, ప్రజల టీం మాత్రమేనని స్పష్టం చేశారు. తాను సెక్యులర్ విధానానికే కట్టుబడి ఉన్నానని, సెక్యులరిజంను వ్యతిరేకించేవారితో కలిసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



## ఉగాది పండుగ సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక

### నియోజకవర్గం ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపిన సంకూరి జయప్రకాష్

మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 18 (వార్త వేదిక సూర్య): ఉగాది శ్రీ పరాభవ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాజేంద్ర నగర్ నియోజకవర్గం ప్రజలకు ఇందిరా గాంధీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు సంకూరి జయప్రకాశ్ హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉగాది పండుగ తెలుగు ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, కొత్త ఆరంభాలకు నాంది పలికే పర్వదినమని పేర్కొన్నారు. ఉగాది అనేది కేవలం నూతన సంవత్సర ప్రారంభం మాత్రమే కాకుండా, మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ విలువలను ప్రతిబింబించే ముఖ్యమైన పండుగ అని అన్నారు. ఉగాది రోజున ప్రతి ఒక్కరూ పాత విషయాలను మరిచి కొత్త సంకల్పాలతో ముందుకు సాగాలని సూచించారు. ఉగాది పచ్చడి జీవితంలోని ఆరు రుచులను సూచిస్తూ సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుందని తెలిపారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, సేవాభావం పెంపొందించుకోవడం ద్వారా అభివృద్ధి సాధ్యమవు తుందని పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షిస్తూ, ప్రజలందరూ ఆనందంగా, సంతోషంగా నూతన సంవత్సరాన్ని ఆహ్వానించాలని కోరారు.

## డోన్ బోస్కో హై స్కూల్ లో ఉగాది వేడుకలు




రామన్నపేట, మార్చి 18(వార్తా వేదిక సూర్య) రామన్నపేట పట్టణ కేంద్రంలోని డోన్ బోస్కో హై స్కూల్లో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల ప్రాముఖ్యతను భావితరాలకు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో వేడుకలు నిర్వహించామని కరస్పాండెంట్ పీజీవి చిట్టిబాబు తెలిపారు. షడ్రుచుల ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి జనార్దన్ రావు,స్కూల్ టీచర్స్ అనిల్ కుమార్, నవీన్ కుమార్, సయ్యద్ ఖదీర్ ,హీన, విజయలక్ష్మి, హిరన్మయి, మత్స్యగిరి, సుజాత, శ్రీకాంత్ ,జోజప్ప, సునీత, వెంకట్ కాంబ్లే, మహాలక్ష్మి, సుమ ,జువేరియా, మాధవి, విజయ్ కుమార్, శ్రీలత, అశ్విని ,రేష్మ , వెంకన్న, లింగస్వామి, శ్రీరామ్, నర్సయ్య,విద్యార్థులు పాల్గొన్నారు.

## మత విద్వేషాలు రెచ్చగొట్టే బిజెపి కుట్రలను తిప్పి కొట్టాలి

**▸▸ టీపీపీసీ నాయకులు, అడ్వకేట్ పర్రెపాటి యుగంధర్**



మోత్కూరు, మార్చి 18(వార్త వేదిక సూర్య) : బ్రాహ్మణులు చదువుతున్న వేదమంత్రాలు సామాన్య ప్రజలకు సరళమైన భాష లో అర్థం కావడం లేదని భావనతోనే తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యాఖ్యలు చేశారని, వారిని ఏమాత్రం కించపర్చాలన్న ఉద్దేశం లేదని టీపీపీసీ నాయకులు, అడ్వకేట్ పర్రెపాటి యుగంధర్ అన్నారు. బుధవారం ఆయన మోత్కూరులో విలేకరులతో.ఎమ్మెల్యే సామేల్ వ్యాఖ్యలను తప్పుదారి పట్టించిన బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టాలన్న కుట్రకు పూనుకుందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కు ఇతర రాజకీయ పక్షాలకు లేకుండా చేయాలనే బీజేపీ కుట్రలను రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. ఎమ్మెల్యే సామేల్ బ్రాహ్మణులు చదువుతున్న భాషా అర్థం కావడం లేదని అనే భావనను వ్యక్త పరచడంలో జరిగిన వ్యక్తీకరణే తప్ప ఎవరిని ఉద్దేశించింది కాదన్నారు. తాను చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సామేల్ బ్రాహ్మణ వర్గాల పెద్దలకు వివరణతో క్షమాపణలు చెప్పినప్పటికీ కూడా బీజేపీ వర్గాలు సామేల్ ఇంటిపై దాడులు చేయడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఈ విషయంలో బ్రాహ్మణ మేధావులు ఆలోచించాలని కోరారు. బీజేపీ రాజకీయ ప్రయోజనాలకే వాడుకుంటుందే తప్ప ఆ వర్గాలపై ఏలాంటి ప్రేమ లేదన్నారు. సామేల్ చెప్పిన క్షమాపణ లపై ఆలోచన చేసి బ్రాహ్మణులు పెద్దన్న పాత్ర పోషించి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాలని కోరారు.

## నవోదయ ప్రవేశ పరీక్షలో 157 ర్యాంక్ సాధించిన దీప్నా కుమారి



మోత్కూరు, మార్చి 18 (వార్త వేదిక సూర్య): మండలంలోని పొడిచేడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న జిట్ట దీప్నా కుమారి గత డిసెంబర్ 13న జరిగిన 6వ,తరగతి నవోదయ ప్రవేశ పరీక్ష వ్రాయగా మంగళవారం నాడు రాష్ట ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో 85 మార్కులతో 157వ, ర్యాంకు సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వల్లపు బిక్షం తెలిపారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ నవోదయ ప్రవేశ పరీక్షలో తమ పాఠశాలకు చెందిన రాష్ట్రస్థాయిలో 157 ర్యాంక్ సాధించిన చిన్నారి దీప్నా కుమారిని అభినందించారు. దీప్నా కుమారి ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయుల బృందం,తల్లిదండ్రులు జిట్టా సైదులు సంధ్యారాణి. సంతోషం వ్యక్తం చేశారు.

## ఇఫ్తార్ విందు ఏర్పాటు అభినందనీయం

**▸▸ రామన్నపేట ఎస్సై డి. నాగరాజు**



రామన్నపేట,మార్చి 18 (వార్త వేదిక సూర్య): రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీ యమని స్థానిక ఎస్సై డి. నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నాగార్జున స్కూల్ లో కరస్పాండెంట్ డాక్టర్ నకిరేకంటి నాగరాజు, ప్రిన్సిపాల్ రేఖ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్ర మంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మతసామరస్యానికి ప్రతీకగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఉత్తమ పోలీస్ అవార్డు అందుకున్న కానిస్టేబుల్ ప్రవీణ్ కుమార్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సురేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏటెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎండి జమ్మిరుద్దీన్, నాయకులు ఎం.డి. అక్రమ్, ఎండి వహీద్, ఎస్ కే చాంద్, ఎండి అన్వర్,చాంద్ పాషా, షేక్ ఫిరోజ్ పాషా, ఆరి ఫ్, అంజాద్, పాఠశాల అధ్యాపకులు విజయ శ్రీ,వినీషా,స్వప్న, మీర్జా అక్రమ్,నరసింహ, బొడ్డు బిక్షపతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల మానవీయత - దప్పిక తీరుస్తున్న చలివేంద్రం

- బాధ్యతతో పాటు మానవత్వం
- ఎస్సై అశోక్ చొరవతో చలివేంద్రం ప్రారంభం!
- ఎండల తీవ్రత దృష్ట్యా బాటసారుల కోసం తాగునీటి వసతి
- పోలీసుల సామాజిక సేవా కార్యక్రమాలపై ప్రజల హర్షం




యాదాద్రి భువనగిరి జిల్లా/మోటకొండూరు/వార్త వేధిక సూర్య ప్రతినిది (గుర్రాల నాగరాజు): వేసవి భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్న వేళ, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మోటకొండూరు మండల ఎస్సై అశోక్ ఒక గొప్ప ముందడుగు వేశారు. శాంతిభద్రతల పరిరక్షణే కాకుండా, సామాజిక బాధ్యతలోనూ తాము ముందుంటామని వారు నిరూపించారు."మోటకొండూరు మండల కేం ద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధ వారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ.. ఎండలు ముదురుతున్న తరుణంలో ప్రయాణికులు, సామాన్య ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాటు చేశామని తెలిపారు. కేవలం చల్లటి నీరు మాత్రమే కాకుండా, వీలైతే మజ్జిగ కూడా అందించేలా ప్రణాళిక చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.పోలీసు శాఖ కేవలం నేరస్తులను పట్టుకోవడమే కాకుండా, ప్రజల కష్టాల్లో పాలుపం చుకోవడం అభినందనీయం. అని,ఈ చలివేంద్రం వల్ల మార్కెట్‌కు వచ్చే రైతులకు, బాటసారులకు ,ఎంతో మేలు జరుగుతుంది. స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ఎస్సై చొరవను కొనియాడా రు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిదులు,పలు పార్టీల నాయకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి ఎమ్మెల్యే ముందుల సామేల్ ఇంటిపై దాడినీ కండిస్తున్నాం

**- బహుజన సంఘర్షణ సమితి (బి ఎస్ ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గంధమల్ల యాదగిరి**



యాదాద్రి భువనగిరి/మార్చి 17,(వార్తవేదిక సూర్య) :తుంగతుర్తి ఎమ్మెల్యే ముందుల సామేలు ఇంటిపై బీజేపీ చేసిన దాడినీ కండిస్తున్నాం అని బహుజన సంఘర్షణ సమితి (బి ఎస్ ఎస్) వ్యవస్థాపక అధ్యక్షు డు గంధమల్ల యాదగిరి అన్నారు.ఈ సంద ర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఇది సాధా రణ ఘటన కాదు ఇది మనువాద దుష్టశక్తుల అసలు రూపం బయటపడిన ఘట్టం అని అన్నారు. శతా బ్దాలుగా దళిత, బహుజన సమాజాన్ని అణగ దొక్కుతూ, మోసం చేస్తూ వచ్చిన మనువాద శక్తు లు, ఇప్పుడు ప్రశ్నించే గొంతులను భయపెట్ట డానికి, బెదిరించడానికి, దాడులకు దిగుతు న్నా యి.ఎమ్మెల్యే మందుల సామెల్ సంస్కృత మం త్రాల పేరుతో జరుగుతున్న మోసాలను ప్ర శ్నించడం, బ్రాహ్మణిక వాదాన్ని సవాలు చేయడం ఇది ఆయన రాజ్యాంగబద్ధ హక్కు అని కానీ ఆ హక్కును సహించలేని బీజేపీ, ఆర్ఎస్ఎస్ అ నుబంధ గుంపులు దాడులకు దిగడం చూస్తుంటే, ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఎంత ప్రమాదంలో ఉందో అర్థమవుతోంది, ఒక దళిత ఎమ్మెల్యేను బహిరంగంగా అవమానించడం, "బిడ్డ" అంటూ తక్కువ చేసి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడడం, తర్వాత ఆయన ఇంటిపై దాడి చేయడం ఇది యాదృచ్ఛికం కాదు. ఇది స్పష్టమైన మనువాద అహంకారం. ఇది దళితులపై కొనసాగుతున్న సామాజిక దాడుల మరో రూపం అని అన్నారు.నేను గట్టిగా హెచ్చరిస్తున్నాను దళిత బహుజనులపై దాడులు చేస్తే మేము చూస్తూ ఊరుకోము. మా గౌరవాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తే, ప్రతి దాడికి బహుజన సమాజం గట్టి సమాధానం ఇస్తుందనీ హెచ్చరించారు.ఈ దేశం రాజ్యాంగంతో నడవాలి, మనుస్మృతితో కాదు .ప్రజాస్వామ్యం అంటే భిన్నాభిప్రాయాలను గౌరవించడం దాడులు చేయడం కాదనీ ,ఈ ఘటన దేశానికి తీవ్రమైన హెచ్చరిక అని దళితులు మాట్లాడితే దాడి చేస్తారా, ప్రశ్నిస్తే ఇలానే భయపెడతారా, ఇది ప్రజాస్వామ్యమా లేక మనువాద రాజ్యమా అని ప్రశ్నించారు.బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుబంధ శక్తులకు నేను స్పష్టంగా చెప్పదలచుకున్నది మీ బెదిరింపులు, మీ దాడులు, మీ అహంకారం బహుజన సమాజాన్ని ఎప్పటికీ వంగజేయలేవనీ, మేము పోరాడటం నేర్చుకున్నాము. మేము వెనక్కి తగ్గేది లేదనీ,ఈ దాడికి బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని, దాడి వెనుక ఉన్న కుట్రలను బయటపెట్టాలి,దళిత ప్రజాప్రతినిధుల భద్రతను హామీ ఇవ్వాలి, ద్వేష ప్రసంగాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి,దళితులపై దాడులు ఆపాలి,మనువాదాన్ని తిప్పికొట్టాలి,రాజ్యాంగాన్ని కాపాడాలనీ అన్నారు,బహుజన శక్తి ఏకమైతే మనువాదం కూలిపోతుందనీ,దళిత బహుజనుల గౌరవం కోసం మా పోరాటం కొనసాగుతుందనీ బహుజన సంఘర్షణ సమితి ఎప్పుడు బహుజనుల హక్కుల, ఆత్మగౌరవం కోసం పోరాడుతూనే ఉంటుదని అన్నారు.

## మోత్కూరులో గ్యాస్ కోసం భారీ క్యూ లైన్



మోత్కూరు, మార్చి 18 (వార్త వేదిక సూర్య): ఇజ్రాయిల్‌బిబి ఇరాన్ యుద్ధం వల్ల వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడిందని ప్రజలు బుధవారం తెల్లవారుజాము నుంచే స్థానిక భారత్ గ్యాస్ గోదాం సిలిండర్ల కోసం క్యూలైన్ లో నిలబడ్డారు. గ్యాస్ కోసం బుకింగ్ చేసిన సకాలంలో రావడంలేదని, తద్వారా తాము ఇబ్బందులు పడుతున్నామని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కరించాలని వినియోగాలు కోరుతున్నారు. ఈ ఈ విషయంపై గ్యాస్ గోదాం ఇంచార్జి డిప్యూటీ తహాశీల్దార్ వివరణ చిప్పలపల్లి యాదగిరిని అడగగా గ్యాస్ కోసం బుకింగ్ చేసిన వినియోగదారులందరికీ గ్యాస్ సరఫరా చేసినట్లు తెలిపారు. కొంతమంది వినియోదారులు బుకింగ్ చేయకున్నా గ్యాస్ సిలిండర్ల కోసం క్యూలైన్ లో నిలబడుతున్నారని అన్నారు.

## చక చక కొనసాగుతున్న సుద్దాల యజ్ఞశాల నిర్మాణ పనులు

**▸▸ దగ్గరుండి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ ప్రభాకర్ తేజ**

**▸▸ మాజీ తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ కు సుద్దాల గ్రామ ప్రజల అభినందనలు**

**▸▸ కొన్ని రోజులుగా వారు చేస్తున్న అభివృద్ధి పనుల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు**



గుండాల,మార్చి 17,(వార్తవేదిక సూర్య) : సుద్దాల గ్రామ అభివృద్ధిలో భాగంగా మొదట శ్రీశ్రీశ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో యజ్ఞశాల నిర్మాణానికి పనులు ప్రారంభించి మొదటి దశగా ఇనుప పిల్లర్లను మరియు వాటికి కావలసిన సామాగ్రినంత అందించి మొదటి అంకాన్ని పూర్తి చేసుకున్నారు. తదుపరి నిర్మాణాన్ని ఉగాది తర్వాత బ్రహ్మోత్సవాలకు ముందుగానే పూర్తి చేసి బ్రహ్మోత్సవాలు పూర్తి వాడుకలోకి తీసుకొస్తామని తెలియజేశారు.ఈ సందర్భంగా పలువురు గ్రామ ప్రజలు యువకులు, సుద్దాల అశోక్ తేజ సోదరుల సేవలను గుర్తించి వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మునుముందు గ్రామంలో జరగబోయే అభివృద్ధి కార్యక్రమంలో ఇలానే భాగస్వామ్యం కావాలని కోరుకున్నారు ఎప్పుడు బిజీ బిజీగా ఉండే సుద్దాల సుధాకర్ తేజ మాజీ తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు గ్రామంలో ఉత్సాహంగా ఉంటూ అభివృద్ధిలో భాగమైతున్నందుకు ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**- ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్**
**- ఇ ఎల్ వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఎంసెట్, నీట్ కోచింగ్**




చౌటుప్పల్, మార్చి 18,(వార్త వేదిక సూర్య) : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ అన్నారు.చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేద విద్యార్థుల కోసం ఉచిత ఎంసెట్ , నీట్ కోచింగ్ తరగతులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలనే తమ కలను నిజం చేసుకునేందుకు ఈ ఉచిత శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. నాణ్యమైన కోచింగ్ అందజేయడం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులను పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలపడమే ఈ ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు తమ పూర్తి బయోడేటాతో 96344 43338 నంబర్‌కు వాట్సాప్ లో సమర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ఉగాది - వసంత విభావరి

వసంత విభావరిలో విరిసిన వెలుగుల వేళ,
పచ్చని ప్రకృతి పులకించి నవ్విన వేళ,
గడపల గర్భగృహమున మంగళ స్వరమై
తెలుగు తల్లి పండుగగా ఉగాది అవతరించె.
మామిడి తోరణాల పచ్చని తంతువులలో
ఆశల అలలు అలరిస్తూ ఊగుచుండగా,
వేప పుష్పాల చేదు గర్భిత గంధములో
జీవన సత్యాల గూఢార్థం మౌనమై నిలిచె.
కోకిల కూయు కంఠమున కలకల రాగములు
ప్రకృతి మంగళ ధ్వనులై పరిమళించగా,
వసంత సమీర మృదుస్పర్శ సన్నిధిలో
నూతన సంవత్సర స్వప్నాలు సుస్వాగతించె.
మామిడి--వేపల మేళన రసమూర్తిగా
ఉగాది పచ్చడి రూపమై వెలిసిన వేళ,
చేదు--తీపి--పులుపు--కారం--ఉప్పుల రుచులలో
జీవిత చక్రం సత్యమై ప్రతిధ్వనించె.
సంస్కృతి సుమములు వికసించు వేళ,
సంప్రదాయ దీపములు ప్రకాశించు వేళ,
ప్రకృతి--మనుజ బంధమది పావనమై
భూమి ఒడిలో నిత్యమై నిలిచియుండె.
అందుకే ప్రతి ఉగాది ప్రబోధమై,
పచ్చని మామిడి పుటల పలుకులలో,
వేప పుష్ప సుగంధ విరిసిన వేళ,
కోకిల గానామృత తరంగములలో,
ప్రకృతి సాక్షిగా మన జీవన గాథకు
కొత్త ఆది -- కొత్త ఆశ -- కొత్త మార్గమై నిలిచె.

ప్రకృతితో కలిసి జీవిస్తూ, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ, కొత్త ఆశలతో ముందుకు సాగాలి అని కోరుకుంటూ..

మీకు మీ కుటుంబ సభ్యు లకు పకృతి మెచ్చిన ఉగాది పండుగ శుభాకాంక్షలు.



రచన: మంజుల పత్తిపాటి , మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, యాదాద్రి భువనగిరి జిల్లా,తెలంగాణ రాష్ట్రం, చరవాణి: 9347042218.

## రాష్ట్ర ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు

**▸▸ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు గాదె కవిత నరేందర్ రెడ్డి**



యాదాద్రి భువనగిరి జిల్లా, మార్చి 17,(వార్తవేదిక సూర్య) : యాదాద్రి భువనగిరి జిల్లా కు చెందిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకురాలు గాదె కవిత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు . ఈ పరాభవ నామ సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు రావాలని, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

# తుర్కపల్లి ఆధ్యాత్మిక ధ్రువతార 'మేర అంజయ్య' అస్తమయం

యాదాద్రి భువనగిరి/మార్చి 18, (వార్త వేధిక సూర్య) : ఆధ్యాత్మికతకు అభినయం తోడైతే ఎలా ఉంటుందో.. నిరాడంబరతకు నిలువెత్తు రూపం ఎలా ఉంటుందో చెప్ప డానికి నిదర్శనం 'మేర అంజయ్య' (ఆది మూలం అంజయ్య) గారు. తుర్కపల్లి మండల కేంద్రం ఒక గొప్ప కళాకారుడిని, అంతకన్నా గొప్ప మనిషిని కోల్పోయి నేడు మూగబో యింది. ఆయన మరణం కేవలం ఒక కుటుంబానికే కాదు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని జానపద, ఆధ్యాత్మిక కళారంగానికి తీరని లోటు.

మృదు స్వభావమే ఆయన ఆభరణం

అంజయ్య గారు అంటేనే ఒక ఆప్యాయత. గ్రామంలో ఎవరిని చూసినా ఆపి పలకరించడం, యోగక్షేమాలు అడగడం ఆయన నైజం. ఎవరి ఇంట్లో ఆపద ఉన్నా పలకరించి ధైర్యం చెప్పడంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు. ఈ మృదు స్వభావమే ఆయనను అందరివాడిగా మార్చింది.

**ఆధ్యాత్మిక చైతన్యం..భజన కోకిల**

గ్రామంలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించడంలో అంజయ్య పాత్ర చిరస్మరణీయం.

**వినాయక నవరాత్రులు:** గ్రామంలో తొలిసారిగా వినాయక మండపాన్ని ఏర్పాటు చేసి, ఆ ఉత్సవాలకు ఒక క్రమశిక్షణను, భక్తిని జోడించిన వ్యక్తుల్లో ఆయన ప్రథములు.

**ఆ కంచు కంఠం ఇక వినబడదు:** సాయంత్రం ఏడైందంటే చాలు.. "భక్తులంతా మండపం దగ్గరికి రావాలి" అంటూ మైకులో వినిపించే ఆయన కంచు కంఠం తుర్కపల్లి వాసులకు ఒక మేల్కొలుపు.

**భజన రూపశిల్పి:** పాండురంగ భజనలు పాడుతూ, ఆ పాటలకు అనుగుణంగా అడుగులు ఎలా వేయాలో ఆయన నేర్పించే తీరు అద్భుతం. ఆయన గొంతెత్తి పాడుతుంటే గ్రామస్తులు మైమర్చి అర్ధరాత్రి వరకు భజనల్లో మునిగితేలేవారు.

**రాముని సేవలో.. అభినయ తపస్విగా..**

శ్రీరామనవమి వచ్చిందంటే అంజయ్య భక్తి మరో రూపం దాల్చేది. స్వామివారి ఉత్సవ మూర్తులకు తన చేతులతో స్వయంగా పట్టు వస్త్రాలు కుట్టి అలంకరించేవారు. కల్యాణం నాడు కీర్తనలు పాడుతూ, వేదికలను సిద్ధం చేస్తూ అలుపెరగని సేవ చేసేవారు.

**బహుముఖ ప్రజ్ఞ**

భాగవత ప్రదర్శనల్లో ఆయన వేసిన రాముడు, రావణాసురుడు, మల్లన్న వేషాలు ప్రేక్షకుల హృదయాల్లో ముద్ర వేసుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో గ్రామాల్లో ప్రదర్శనలు ఇచ్చి, ఉత్తమ కళాకారుడిగా ఎంతో మంది మెప్పు పొందారు.

**ఉమ్మడి కుటుంబానికి ఆదర్శం**

నేటి కాలంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న తరుణంలో, ఎన్నో ఏళ్లుగా తన కుటుంబాన్ని ఏకతాటిపై నడిపిస్తూ, ప్రేమానురాగాలను పంచుతూ ఆయన ఆదర్శంగా నిలిచారు. వివాదరహితుడిగా, నీతినిజాయితీలకు కట్టుబడిన వ్యక్తిగా ఆయన జీవితం

**నేటి తరానికి స్ఫూర్తిదాయకం.**

విధి ఆ మనసున్న మనిషిని మన నుండి దూరం చేసింది. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాడిన కీర్తనలు, ఆయన వేసిన వేషధారణలు తుర్కపల్లి గాలిలో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. ఆ పవిత్ర



ఆత్మకు శాంతి చేకూరాలని, సీతారామచంద్రస్వామి ఆయన కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ.. మీ పాదాలకు నమస్కరిస్తూ

**– రమణాకర్ పత్తిపాటి**

యాదాద్రి భువనగిరి **వార్త వేదిక సూర్య** యాదాద్రి భువనగిరి గురువారం, మార్చి 19, 2026
సంపుటి : 1 సంచిక : 292

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సు రద్దు

• డిటిఓ సాయి కృష్ణ



**తుర్కపల్లి, మార్చి 18, (వార్త వేదిక సూర్య):** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేయనున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా రవాణా శాఖ అధికారి సాయి కృష్ణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్యాలయం జిల్లా పరిధిలో డ్రైవింగ్ లైసెన్సుల సస్పెన్షన్లు ఘననీయంగా నమోదైనట్లు తెలిపారు. 2025 ఏప్రిల్ ఒకటి నుండి 2026 మార్చి 15 వరకు మొత్తం 337 లైసెన్సులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రధాన కారణంగా నిలిచిందని అన్నారు. ఈ క్రమంలో 207 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. కోర్టు కేసుల కారణంగా 58 లైసెన్లు సస్పెండ్ చేసినట్లు, ప్రమాదాల కారణంగా 02 లైసెన్సులు నిలిపివేసినట్లు, ఓవర్ లోడ్ వాహనాలపై కూడా చర్యలు తీసుకుంటూ 10 లైసెన్సులను సస్పెండ్ చేసినట్లు వివిధ ఆర్డర్ల కింద 60 లైసెన్సులను తిరిగి మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రమాదాలకు సంబంధించి లైసెన్సులు రద్దు చేసిన సందర్భాల్లో గరిష్ఠంగా ఆరు నెలల వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. మిగతా కేసులో డ్రంక్ అండ్ డ్రైవ్, కోర్టు కేసులు, ఓవర్ లోడ్ తదితర సాధారణంగా మూడు నెలల వరకు లైసెన్సు రద్దు చేస్తామని పేర్కొన్నారు .రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని నియమాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా వాహనాలు నడపాలని సూచించారు.

## ఉగాది పండుగ ఏర్పాట్లను మున్సిపల్ చైర్ పర్సన్ పరిశీలన



**మోత్కూరు, మార్చి 18 (వార్త వేదిక సూర్య ):** మోత్కూరులో నేడు జరగనున్న ఉగాది పర్వదిన వేడుకలను స్థానిక తూర్పు ముత్యాలమ్మ , (చెరువు కట్ట ) పడమటి ముత్యాలమ్మ దేవాలయాలను మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య, మున్సిపల్ కమీషనర్ కే సతీష్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోనే ఎక్కడ లేని విధంగా మోత్కూరులో ఉగాది పర్వదిన పురస్కరించుకొని మహిళలు బోనాలు, ఎడ్లబండ్ల ప్రదర్శన, చేస్తుంటారని, ఈ పండగ వాతావరణాన్ని ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు

## ఐఐటి-జేఈఈ/నీట్/ఎంసెట్, కోసం చౌటుప్పల్ లో ఉచిత శిక్షణ కేంద్రం

**చౌటుప్పల్ ,మార్చి 18 (వార్త వేదిక సూర్య ):** హైదరాబాద్లో హాస్టళ్ళలో ఉంటూ, గ్రామాల నుంచి హైదరాబాద్ కి, వెళ్ళి వస్తూ, నానా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని, రత్నం ఫౌండేషన్, ముందు చూపుతో మునుగోడు నియోజకవర్గ విద్యార్థులకు, చౌటు ప్పల్ కేంద్రంగా వివిధ సబ్జెక్టులలో అనుభ వజ్ఞులైన అధ్యాపకులతో ఐఐటి-జేఈఈ /నీట్/ఎంసెట్, పరీక్షలకు, 45 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు అందించబోతుంది. కావు న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోగలరని మనవి. మార్చి 16 నుండి తరగతులు ప్రారంభం కోచింగ్ కు, వచ్చిన వారికి ఉచిత మెటీరియల్ ఇవ్వబడును. ఉచిత మెగా గ్రాండ్ టెస్ట్: మొదటి బహుమతి- 5,016/- రెండవ బహుమతి-2,516/- వివరాలకు: రత్నం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ ఊదరి మల్లేష్, 9000163356, 9133016336 సంప్రదించండి.




## పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

▶▶ జిల్లా కలెక్టర్



**తుర్కపల్లి, మార్చి 18/వార్త వేదిక సూర్య :** పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు హాజరు వివరాలను సంబంధిత పరీక్ష అధికారులను అడిగి తెలుసుకున్నారు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులను ప్రధాన గేటు వద్ద పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తర్వాత పరీక్ష కేంద్రంలోకి పంపించాలని అన్నారు. ప్రశ్నాపత్రాలు జవాబు పత్రాల డిపాజిట్ లను పోలీస్ భద్రతతో డిపాజిట్ చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పరీక్షా కేంద్రంలోకి ఇతర వ్యక్తులు వెళ్లకుండా చూడాలని అన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల జిరాక్స్ కేంద్రాలు మూసివేసేలా చూసుకోవాలన్నారు జిల్లాలో ఎక్కువ మాల్ ప్రాక్టీస్ జరపరాదని పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు



**మోత్కూరు, (అడ్డ గూడూరు) మార్చి 18 (వార్తా వేదిక సూర్య ) :** అడ్డగూడూరు మండలంలోని జానకిపురంలో పశువులకు బుధవారం ఉచిత గాలికుంటు నివారణ వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పశు వైద్యాధికారి అనిల్ రెడ్డి మాట్లాడుతూ వేసవికాలంలో పశువుల ఆరోగ్యం పై రైతులు జాగ్రత్త వహించాలని కోరారు. పశువులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత టీకాల శిబిరాలను చదివినియోగం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిత సమ్మయ్య, పశు వైద్య సిబ్బంది ఈశ్వరయ్య, గోపాలమిత్రలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బునాది గాని చెరువు లోకి గోదావరి జలాలు తెచ్చిన ఘనత ఎమ్మెల్యే కుంభంకే దక్కుతుంది

**వలిగొండ: మార్చి 18 (వార్త వేధిక సూర్య ):** వలిగొండ మండల పరిధిలోని పైల్వాన్ పురం గ్రామంలో గల పునాది చెరువులోకి గోదావరి జలాలు తెచ్చి ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష తీర్చిన ఘనత స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కే దక్కుతుందని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వాకిటిఅనంతరెడ్డి అన్నారు.బుధవారం ఆయన ఒక ప్రకటనలో కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసిన దూరాలోచన ప్రతిఫలమే నేటి బునాది గాని చెరువు నిండి బీట్లు పారిన వరి పోలాలకు నీరు అంది రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చేందుకు గతంలో మాజీ మంత్రి ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి, మాజీ ఎంపీ కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా వారికి ఈ ప్రాంత ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు.



## యాదవులు రాజకీయంగా రాణించాలి




**మోత్కూరు, మార్చి 18 (వార్త వేదిక సూర్య ):** రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా యాదవులు పోటీ చేయడమే కాకుండా వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగ శ్రీను యాదవ్ అన్నారు. బుధవారం ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్లుగా గెలిచిన కొండ శోభ సోంమల్లు, నల్ల మధు యాదవ్ లను స్థానిక యాదవ సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యాదవుల సంఖ్య బలంగా ఉందని, రానున్న ఏ ఎన్నికలు వచ్చినా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షులు రూల మల్లయ్య, ఉపాధ్యక్షులు జంగ వెంకట నర్సు, యాదవ సంఘం మండల నాయకులు అవిశెట్టి స్వామి, గజ్జి మల్లేశం, జంగ నర్సయ్య , జంగ సతీష్, పురుగుల రమేష్, పురుగుల లింగయ్య, మేడబోయిన నరేష్, పురుగుల శ్రీను, అవిశెట్టి ముత్యం, పురుగుల సమ్మయ్య, బుర్ర శివ మల్లేష్, శక్తి భాస్కర్, వడాకాల సుదర్శన్, గురువుల సారయ్య జంగ సుధాకర్ , మత్స్యగిరి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

• గుండు వెంకటనర్సు

సిపిఎం మండల కార్యదర్శి



**మోత్కూరు, మార్చి 18( వార్త వేదిక సూర్య );** రాష్ట్రంలో ప్రభుత్వాలు ఎన్నో మారుతున్న మండలంలో దీర్ఘకాళికంగా ఉన్న సమస్యలు పరిష్కారం కావడం లేదని, సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. బుధవారం మోత్కూరు మండలం పాలడుగు గ్రామ శాఖ సమావేశం వెండి యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ మోత్కూరు మండలంలో రోడ్లు, సాగునీటి కాల్వలు, విద్యా, వైద్యం, అన్ని రంగాల అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. దీర్ఘకాలిక సమస్యలైన మోత్కూరులో ఆర్టీసీ బస్ డిపో, 30 పడకల ఆసుపత్రి, పోస్ట్ మార్టం సౌకర్యం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రెవిన్యూ డివిజన్, సివిల్ కోర్ట్, గు రుకులాలకు సొంత భవనాలు, గుండాల బిబి మోత్కూరు మధ్య బిక్కెరు వాగుపై నూతన బ్రిడ్జి నిర్మా ణం లాంటి సమస్యల పరిష్కారానికి మండల ప్రజలు దశబ్దాలుగా ఎదురు చూస్తున్నారని అన్నారు. గత ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధి కారంలోకి వచ్చిన కాంగ్రెస్, దాదాపు రెండున్నర ఏళ్లు దాటినా ఏఒక్క హామీ అమలు నోచుకోలేదని విమర్శించారు.బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేస్తామని రూ 261 కోట్లు మంజూరైనట్లు ప్రభుత్వం ప్రకటించి ఏడాది దాటిన నేటికీ ఏలాంటి పనులు ప్రారంభించలేదన్నారు.

అసంపూర్తిగా ఉన్న కాల్వతో సాగు నీరులేక మోత్కూరు అడ్డగూడూరు మండలాల రైతు ల బావులు బోర్లలో భూగర్భజలాలు అడుగంటి పంటపొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాల్వపనులు పూర్తి చేయడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు. బడ్జెట్ లో నిధులు లేవన్నా సాకుతో అనేక గ్రామాలలో నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, తక్షణమే మండల ప్రజా సమస్యలను పరిష్కరించి, ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, సహాయ కార్యదర్శి కొంపల్లి గంగయ్య, నాయకులు చింతకింది సోమరాజు, దడిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుని కుటుంబానికి మన మోత్కూర్ వాట్సాప్ గ్రూప్ ఆర్థిక చేయూత

**మోత్కూరు, మార్చి 18 (వార్తా వేదిక సూర్య );** మోత్కూరు .మున్సిపల్ కేంద్రానికి చెందిన శ్రీ రామోజు సత్యనారాయణ చారి పాత పోస్టాఫీస్ వద్ద కిరాయికి ఉంటున్న ఇంట్లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం ఇటీవల జరగడంతో వారు నిరాశ్రయులయ్యారు. దీంతో స్పందించిన మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ సభ్యులు ,దాతలు రూ 8000 సేకరించగా బుధవారం బాధితుని కుటుంబానికి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మొగుల్లపల్లి సోమయ్య,కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న లు స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు,మొరిగాల శ్రీనివాస్, కోమటి జనార్దన్, శ్రీ రామోజు శివ తదితరులు పాల్గొన్నారు.



## కేహెచ్ఆర్ ఫౌండేషన్ చలివేంద్రంను ప్రారంభించిన మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి

- కార్యక్రమంలో పాల్గొన్న కొప్పుల హరిదీప్ రెడ్డి




**ఆత్మకూరు (ఎం), మార్చి 18, (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో చలివేంద్రంను ప్రారంభించిన మాజీ ప్రభుత్వ విప్ మాజీ శాసన సభ్యులు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చలివేంద్రం నిర్వాహకులు కేహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొప్పుల హరిదీప్ రెడ్డి. ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... వేసవి కాలంలో వడ దెబ్బకు ఎంతో మంది అనారోగ్యం చెందుతారని సమయానికి నీరు త్రాగాలని లేదంటే ఆరోగ్య సమస్యలు ఎదురు అవుతాయని సూచించారు బాటసారులకు దాహార్తి తీర్చడం గొప్ప విషయం అని, ఆత్మకూరు మండల ప్రజలకు చలివేంద్రం తో పాటు ఎంతో మందికి తమ వంతు సేవలను అందించడం అభినందనీయం అని ప్రశంసించారు .ప్రజలలో ఉంటూ ప్రజాసేవ చేయడం నా అదృష్టం అని, ప్రజా ఆశీస్సులు ఉన్నంత వరకు మేము మా కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మున్ముందు ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రారెడ్డి, జిల్లా నాయకులు భాషబోయిన ఉప్పలయ్య కోరే బిక్షపతి లాగ్గాని రమేష్ సోలిపురం అరుణ కాల మల్లేష్ కోల సత్తయ్య పల్లెర్ల సత్యనారాయణ కొండపల్లి అబ్బ సాయిలు యాస అంజిరెడ్డి పురుషోత్తం రెడ్డి గట్టు శంకర్ బూడిది వెంకన్న లోడి మధు లోడీ పరుశరాములు శివ మల్లేష్ లోడి శంకర్ గజ్జెల్లి మహేష్ ఎలిమినేటి మచ్చగిరి కొమ్మరాజుల ఉదయ్ పంజాల సాయి మరాఠీ దుర్గా రాజు తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**